



# వార్తాప్రభ

RNI No. APTEL/2004/12176

epaper : https://varthaprabha.com

సమగ్ర వార్తా దినపత్రిక

విజయవాడ, హైదరాబాద్ నుండి ప్రచురణ






| విజయవాడ | సంపుటి : 24 | సంచిక : 178 | ది. 18-9-2025 | గురువారం | పేజీలు : 8 | వెల : రూ.1/- |
|---|---|---|---|---|---|---|
| VIJAYAWADA | Vol.No : 24 | Issue No : 178 | Date : 18-9-2025 | Thursday | Pages : 8 | Rs.1/- |


# అణు బెదిరింపులకు భయపడం: ప్రధాని మోదీ

**భూపాల్,సెప్టెంబరు 17 (వార్తాప్రభ) :** ఇది నవ్య భారతదేశం.. ఎవరి అణు బెదిరింపులకు భయపడదు.. తిరిగి ఎదురు దాడి చేస్తుంది' అని ప్రధాని నరేంద్ర మోదీ తన పుట్టినరోజు సందర్భంగా మధ్యప్రదేశ్‌లోని ధార్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పరోక్షంగా పాకిస్తాన్‌ను ఉద్దేశిస్తూ హెచ్చరించారు. తన 75వ జన్మదినం సందర్భంగా ప్రధాని మోదీ మధ్యప్రదేశ్‌కు 'రిటర్న్ గిఫ్ట్'ను అందజేశారు. ధార్‌లోని మెగా టెక్స్‌టైల్ పార్క్‌ను ప్రధాని మోదీ ప్రారంభించారు. ఈ పార్క్ మూడు లక్షల మందికి ఉపాధి అందించనుంది. అలిగే లక్షలాది మంది రైతులకు ప్రయోజనం చేకూర్చనుంది. ప్రధాని నరేంద్ర మోదీ తన 75వ పుట్టినరోజు సందర్భంగా ధార్‌లో పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ధార్ చేరుకున్న ప్రధాని మోదీని ముఖ్యమంత్రి డాక్టర్ మోహన్ యాదవ్‌తో పాటు పలువురు సీనియర్ నాయకులు స్వాగతించారు. కేంద్ర సహాయ మంత్రి సావిత్రి ఠాకూర్



ప్రధాని మోదీని సాంప్రదాయ తలపాగా, శాలువా లతో సత్కరించారు. ముఖ్యమంత్రి డాక్టర్ మోహన్ యాదవ్ ఆయనకు జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ తన ప్రసంగంలో ఇటీవలి పహల్గామ్ ఉగ్రవాద దాడిని ప్రస్తావించారు. అమరవీరులైన సైనికులకు నివాళులర్పించారు. భారత సైనికుల ధైర్యం, పరాక్రమాలను ప్రశంసించారు. ఇది నవ్య భారతదేశం.. ఎవరి అణు బెదిరింపులకు భయపడదు.. తిరిగి ఎదురు దాడి చేస్తుందని పాక్‌ను ఉద్దేశించి ప్రధాని మోదీ హెచ్చరించారు. మధ్యప్రదేశ్ ప్రజల శక్తి, కృషి సహకారాన్ని కూడా ప్రధాని మోదీ ప్రశంసించారు. ముఖ్యమంత్రి డాక్టర్ మోహన్ యాదవ్ మాట్లాడుతూ మోదీ నాయకత్వం భారతదేశాన్ని మార్చివేసిందని, పీఎం మిత్రా పార్క్ ద్వారా నిమార్ మాల్వా ప్రాంతంలో ఒక ప్రధాన మార్కెట్ ఏర్పడబోతున్నదని దీనికి ఈరోజు పునాది రాయి పడిందని అన్నారు.

# దేశానికి దిక్సూచిలా తెలంగాణ విద్యా విధానం ..

- భాష, జ్ఞానం, నైపుణ్యాలు, క్రీడలు మేళవింపుతో ఉండాలి...
- విజన్ డాక్యుమెంట్ 2047లో విద్యా విధానానికి ప్రత్యేక అధ్యాయం..
- విద్యా రంగం సమూల ప్రక్షాళనే మా ధ్యేయం
- సిలబస్, వనరుల సమీకరణ, విధానం అమలుపై స్పష్టత అవసరం..
- తెలంగాణ విద్యా విధానంపై సమావేశంలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి
- తమ అభిప్రాయాలు... అనుభవాలను వెల్లడించిన విద్యావేత్తలు...



**హైదరాబాద్,సెప్టెంబరు 17 (వార్తాప్రభ) :** క్షేత్ర స్థాయి పరిస్థితులు, అధ్యయనం, భవిష్యత్ అవసరాలకు తగినట్లు రూపొందించే తెలంగాణ విద్యా విధానం భారతదేశ విద్యా విధానానికి దిక్సూచిలా ఉండాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. ప్రస్తుత విద్యా విధానంలో భాష ఉన్న వారి దగ్గర జ్ఞానం లేదని... జ్ఞానం ఉన్న చోట భాష లేదని.. రెండు ఉన్న చోట నైపుణ్యాలు లేవని.. కానీ ఈ మూడింటి కలబోతగా విద్య ఉండాలని సీఎం పేర్కొన్నారు. తెలంగాణ విద్యా విధానం నివేదిక రూపకల్పనపై తెలంగాణ సెక్రటేరియట్‌లో బుధవారం నిర్వహించిన సమావేశంలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి మాట్లాడారు. తెలంగాణలో విద్యా రంగాన్ని సమూల ప్రక్షాళన చేయాలని తాము నిర్ణయించుకున్నట్లు సీఎం తెలిపారు. గతంలో పేదరిక నిర్మూలనకు ప్రభుత్వాలు భూముల పంపకం... నిధుల పంపిణీ వంటి కార్యక్రమాలు చేపట్టేవని... ఇప్పుడు పంపకానికి భూములు, తగినన్ని నిధులు లేవన్నారు. ఇప్పుడు పేదరిక నిర్మూలనకు విద్య తప్ప మరో ఆయుధం లేదని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. విద్యా రంగం ప్రాధాన్యతను గుర్తించినందునే ప్రథమ ప్రధానమంత్రి జవహర్ లాల్ నెహ్రూ దేశంలో విశ్వ విద్యాలయాలు, ఐఐటీలు వంటి ఉన్నత విద్యా సంస్థలను స్థాపించారని గుర్తు చేశారు. మిశ్రమ ఆర్థిక వ్యవస్థగా ఉన్న కాలంలో ఉద్యోగావకాశాలకు అనేక పరిమితులు ఉన్నాయని సీఎం అన్నారు. సరళీకృత ఆర్థిక వ్యవస్థ అమల్లోకి వచ్చిన తర్వాత దేశ, విదేశాల్లో ఉపాధి అవకాశాలు భారీగా పెరిగినప్పటికీ విద్యాప్రమాణాలు ఆస్థాయిలో పెరగకపోవడంతో వాటిని అందిపుచ్చుకోవడంలో మనం విఫలమవుతున్నామని సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. కాలానుగుణంగా ఇంజినీరింగ్ కళాశాలలు వచ్చినందునే పెద్ద సంఖ్యలో సాఫ్ట్ వేర్ రంగంలో మన యువత రాణిస్తున్నారని సీఎం తెలిపారు. అయినప్పటికీ మన రాష్ట్రం నుంచి ఏటా బయటకు వస్తున్న లక్షలాది మంది ఇంజినీరింగ్ విద్యార్థుల్లో పది శాతం మందికి కూడా ఉద్యో గాలు దక్కడం లేదన్నారు. తగినంత నైపుణ్యం లేకపోవడమే అందుకు కారణమన్నారు. ఆ రంగంలో నైపుణ్యాలు పెంచడంతో పాటు ఇంకా పలు రంగాల్లో అవకాశాలు విస్తృతమైనందున ఆ అవకాశాలు అందిపు చ్చుకునేలా విద్యా రంగాన్ని సమూలంగా ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉందని సీఎం తెలిపారు.

**విద్యా రంగానికి భారీఎత్తున నిధులు కేటాయిస్తున్నా..** ఏటికేడు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గుముఖం పడుతోందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ప్రైవేటు పాఠశాలలు నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీతో ప్రారంభిస్తుంటే ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటో తరగతి నుంచి ప్రారంభమవుతున్నాయన్నారు. నర్సరీకి ప్రైవేటు పాఠశాలలో చేరిన వారు తిరిగి ప్రభుత్వ పాఠశాలల వైపు చూడడం లేదన్నారు. విద్యార్థుల రాకపోకలు, తగిన శ్రద్ధ చూపుతారనే కారణంతో తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలల్లో చేర్పిస్తున్నారని సీఎం తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు ఆ రకమైన ధీమా కల్పించగల్గితే తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్చుతారని.. తెలంగాణ విద్యా విధానం రూపకల్పనలో ఈ అంశాన్ని దృష్టిలో పెట్టుకోవాలని సీఎం సూచించారు. విద్యార్థుల సంఖ్యకు తగినట్లు ఉపాధ్యాయులు ఉండాలనే ఉద్దేశంతో తాము అధికారంలోకి రాగానే ఉపాధ్యాయ నియామకాలు చేపట్టామని సీఎం రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. ఉపాధ్యాయులు బోధనపై దృష్టి పెట్టేలా వారికి ప్రమోషన్లు, బదిలీలు చేశామన్నారు. యూనివర్సిటీల వైస్ ఛాన్సలర్ల నియామకం చేపట్టామని సీఎం తెలిపారు. ఉస్మానియా, కాకతీయ విశ్వ విద్యాలయాలు గతంలో సైద్ధాంతిక భావజాలలకు నిలయంగా నిలిచి ప్రజా సమస్యలపై ఆందోళనలు, ఉద్యమాలు చేపట్టేవని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. పాఠశాల స్థాయి నుంచి విశ్వ విద్యాలయాల స్థాయి వరకు విద్యా ప్రమాణాలు పడిపోవడం.. నైపుణ్యాల లేమితో ఉద్యోగాలు లభించకపోవడంతో విద్యార్థులు డ్రగ్స్ బారినపడి జీవితాలను కోల్పోతున్నారని సీఎం అన్నారు. మన చదువులు భాష, జ్ఞానం, నైపుణ్యాలు, క్రీడల మేళవింపుతో ఉండాలని సీఎం అన్నారు. దేశంలో ఐటీఐలు ప్రారంభించినప్పుడు ఉన్న డీజిల్ ఇంజిన్ మెకానిక్, ఫిట్టర్ వంటి సంప్రదాయ కోర్సులే నేటికీ ఐటీఐల్లో ఉన్నాయని సీఎం తెలిపారు. తాము అధికారంలోకి వచ్చాక ఆధునిక పారిశ్రామిక అవసరాలకు అవసరమైన నైపుణ్యాలు అందించే కోర్సులను అందించేందుకు ఐటీఐల్లో కోర్సులను మార్చామని, యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేశామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు.


# దేశానికి దిక్సూచిలా తెలంగాణ విద్యా విధానం ..


- పారిశ్రామికవేత్తలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటాం
- వచ్చే నెలలోనే విశాఖకు గూగుల్ డేటా సెంటర్
- 2026 ఆగస్టు నాటికి భోగాపురం ఎయిర్ పోర్టు సిద్ధం
- సీఐఐ- గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ బిజినెస్ సమ్మిట్ సమావేశానికి హాజరైన సీఎం చంద్రబాబు
- సీఐఐ నివేదికను విడుదల చేసిన సీఎం, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతా రామన్







**విశాఖ,సెప్టెంబరు 17 (వార్తాప్రభ) :** పారిశ్రామిక వేత్తలకు రాష్ట్రప్రభుత్వం ఎల్లవేళలా అందుబాటులో ఉంటుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ తో పాటు స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ తో ఎవరూ పోటీ పడలేరని సీఎం అన్నారు. విశాఖలో సీఐఐ- గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ బిజినెస్ సమ్మిట్ కు కేంద్ర మంత్రి నిర్మలా సీతా రామన్ తో కలిసి ముఖ్యమంత్రి హాజరయ్యారు. రాష్ట్రంలో పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్యం ఉన్న మానవ వనరులు అందుబాటులో ఉన్నాయని సీఎం అన్నారు. కేంద్రంలో, రాష్ట్రంలో అధికారంలో ఉన్న డబుల్ ఇంజన్ సర్కార్ డబుల్ డిజిట్ గ్రోత్ సాధిస్తుందని అన్నారు. సరైన సమయంలో సరైన చోట సరైన నేతగా ప్రధాని మోదీ ఉన్నారని .. దేశానికి ఆయన పెద్ద ఆస్తి అని సీఎం వ్యాఖ్యానించారు. ప్రధాని మోదీ నేతృత్వంలో భారత్ బలమైన ఆర్థిక వ్యవస్థగా ఉందని అన్నారు. 2028 నాటికే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతుందని స్పష్టం చేశారు. ఏపీ కూడా 2047 నాటికి 2.4 ట్రిలియన్ డాలర్ల ఎకానమీ లక్ష్యంగా విజన్ రూపొందించామని సీఎం స్పష్టం చేశారు. వన్ ఫ్యామిలీ-వన్ ఎంట్రప్రెన్యూర్ నినాదంతో కుటుంబంలో ఒకరిని పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దటంతో పాటు ..రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను, ఆలోచనలను ప్రోత్సహిస్తామని అన్నారు. విభజన తర్వాత వారసత్వంగా వచ్చిన ఇబ్బందులను అధిగమించామని అన్నారు. 2019-24 మధ్య రాజకీయ పరిస్థితులు, పాలనా కారణాల వల్ల ఏపీ చాలా అవకాశాలను కోల్పోయిందని సీఎం వ్యాఖ్యానించారు. ప్రస్తుతం ఏపీలో ఒక రెస్పాన్సిబుల్ ప్రభుత్వం అధికారంలో ఉందని ముఖ్యమంత్రి అన్నారు.

**వచ్చే ఆగస్టుకు భోగాపురం ఎయిర్ పోర్టు సిద్ధం..** ఏపీలో ఉన్న సుదీర్ఘ తీరప్రాంతంతో పాటు పోర్టు ఆధారిత పరిశ్రమల ద్వారా ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తామని ముఖ్యమంత్రి పారిశ్రామిక వేత్తలను ఉద్దేశించి అన్నారు. దీని కోసం ఏపీలో లాజిస్టిక్స్ రంగంపై దృష్టి పెట్టామని పోర్టులు, ఎయిర్ పోర్టులు, రహదారులు, రైల్వేలను సమన్వయం చేస్తూ రవాణా వ్యయాన్ని తగ్గిస్తామని వెల్లడించారు. ఈ ప్రాజెక్టులను పీపీపీ విధానంలో అభివృద్ధి చేయాలని నిర్ణయించినట్టు వెల్లడించారు. వచ్చే ఏడాది ఆగస్టు నుంచి భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం అందుబాటులోకి వస్తుందని తెలిపిన సీఎం.. విశాఖ, విజయవాడ, తిరుపతి, రాజమండ్రి, కడపతో పాటు ఓర్వకల్లు, పుట్టపర్తి లాంటి చోట్ల విమానాశ్రయాలు రాష్ట్రాన్ని ఇతర ప్రాంతాలతో అనుసంధానిస్తున్నాయని స్పష్టం చేశారు. త్వరలో అమరావతిలోనూ అంతర్జాతీయ స్థాయి విమానాశ్రయం నిర్మించాలని నిర్ణయించినట్టు తెలిపారు. హైదరాబాద్-అమరావతి-చెన్నైలను అనుసంధానిస్తూ బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టు కూడా వస్తుందన్నారు. అమరావతి నగరాన్ని గ్రీన్ ఫీల్డ్ నగరంగా నిర్మిస్తున్నామని.. విజయవాడ-గుంటూరులను అనుసంధానిస్తున్నట్టు తెలిపారు. వచ్చే నెలలో విశాఖలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు అవుతుందని అన్నారు. టెక్నాలజీ పరంగా దేశంలోనే తొలి క్వాంటం వ్యాలీని ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. సంజీవని ప్రాజెక్టు ద్వారా బిల్ గేట్స్ ఫౌండేషన్ తో కలిసి డిజిటల్ హెల్త్ రికార్డులను తయారు చేస్తున్నట్టు వివరించారు. అలాగే డేటా లేక్ ద్వారా ప్రభుత్వ శాఖల సమాచారాన్ని అనుసంధానం చేస్తున్నామని స్పష్టం చేశారు. వాట్సప్ గవర్నెన్సు ద్వారా పౌర సేవలను అందిస్తున్నామని వివరించారు. సేవల నాణ్యత కోసం ప్రైవేటు కంపెనీల తరహాలోనే ఈ సేవలకు రేటింగ్ కూడా కోరుతున్నామని అన్నారు. అలాగే జీఎస్టీ స్లాబ్ లను తగ్గిస్తూ కేంద్రం తీసుకువచ్చిన సంస్కరణలు ఓ గేమ్ చేంజర్ గా మారనున్నాయని వివరించారు.


ప్రకటన

మహారాజశ్రీ కృష్ణా జిల్లా మచిలీపట్నం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

E.P. No. 72/2024
In
O.S. No. 209/2023

Between:
ఆరేపల్లి రోహిణి కుమార్ ... D.Hr/వాది
మరియు
కంతేటి స్వరూప్ ... J.Dr/ప్రతివాది

To.,
J.Dr/ప్రతివాది అడ్రస్ :
కంతేటి స్వరూప్, S/o. సత్య వెంకట కృష్ణారావు, వృత్తి : వ్యాపారం, R/o. డోర్ నెం. 14/431, రాబర్ట్సన్ పేట, మచిలీపట్నం, కృష్ణాజిల్లా.

పై నెంబరు E.P. No. 72/2024 in O.S. No. 209/2023లో J.Dr/ప్రతివాది అయిన మీకు నోటీసు అమలు నిమిత్తం ది. 29-09-2025 నకు వాయిదా అయి యున్నది. కావున సదరు వాయిదా రోజున ఉదయం గం. 10-30 ని.లకు పై కోర్టు వారి యెదుట మీరు స్వయంగా గానీ లేదా న్యాయవాది ద్వారా గానీ హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపు కొనగలరు. లేని యెడల మీ పరోక్షమున తదుపరి గ్రంధములు జరిపించబడునని ఇందుమూలంగా తెలియచేయడమైనది.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

**వాయిదా తేది : 29-09-2025**

**పేర్ని సురేష్ బాబు**
D.Hr/వాది తరపున న్యాయవాది
మచిలీపట్నం.
ది.17-09-2025



ప్రకటన

మహారాజశ్రీ కృష్ణా జిల్లా మచిలీపట్నం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

E.P. No. 39/2025
In
O.S. No. 444/2022

Between:
సమ్మెట పార్వతి ... D.Hr/వాది
మరియు
సమ్మెట శ్రీనివాసబాబు ... J.Dr/ప్రతివాది

To.,
J.Dr/ప్రతివాది అడ్రస్ :
సమ్మెట శ్రీనివాసబాబు S/o. చంబయ్య, వృత్తి : వ్యాపారం, R/o. పాత పంచాయతీ ఆఫీస్ ఎదురు, ముక్కొల్లు, గూడూరు మండలం, కృష్ణాజిల్లా.

పై నెంబరు E.P. No. 39/2025 in O.S. No. 444/2022లో J.Dr/ప్రతివాది అయిన మీకు నోటీసు అమలు నిమిత్తం ది 08-10-2025 నకు వాయిదా అయి యున్నది. కావున సదరు వాయిదా రోజున ఉదయం గం. 10-30 ని.లకు పై కోర్టు వారి యెదుట మీరు స్వయంగా గానీ లేదా న్యాయవాది ద్వారా గానీ హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపు కొనగలరు. లేని యెడల మీ పరోక్షమున తదుపరి గ్రంధములు జరిపించబడునని ఇందుమూలంగా తెలియచేయడమైనది.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

**వాయిదా తేది : 08-10-2025**

**పేర్ని సురేష్ బాబు**
D.Hr/వాది తరపున న్యాయవాది
మచిలీపట్నం.
ది.17-09-2025


# నెల్లూరు జిల్లా రోడ్డు ప్రమాదంపై ముఖ్యమంత్రి చంద్రబాబు దిగ్భ్రాంతి

## చిన్నారి తో సహా ఏడుగురి మృతి



**అమరావతి,సెప్టెంబరు 17 (వార్తాప్రభ) :** నెల్లూరు జిల్లా సంగం మండలం పెరమన వద్ద బుధవారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంపై ముఖ్యమంత్రి చంద్రబాబు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. రాంగ్ రూట్ లో వచ్చిన టిప్పర్, కారు ను ఢీ కొట్టింది. ఈ ఘటనలో నెల్లూరు నగరం, ఇందుకూరుపేటకు చెందిన ఏడుగురు ప్రాణాలు కోల్పోవడం కలిచివేసిందన్నారు. ఈ ఘోరప్రమాదంలో తాళ్లూరు శ్రీనివాసులు, తాళ్లూరి రాధా, శేషం శేరమ్మ, శేషం బాలవెంగయ్య, తెల్లగుండ్ల శ్రీనివాసులు, తెల్లగుండ్ల లక్ష్మీ, కత్తి బ్రహ్మయ్య మృతి చెందడంపై ముఖ్యమంత్రి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సీఎం ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ప్రమాదంపై విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని సీఎం అన్నారు. ఆస్పత్రిలో బంధువులను పరామర్శించేందుకు గుర్రాలమడుగు సంగం నుంచి ఆత్మకూరు వెళ్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది.

# సూర్యలంక బీచ్ ఫెస్టివల్ నిర్వాణ ఏర్పాట్లపై మంత్రుల బృందం సమావేశం

**అమరావతి,సెప్టెంబరు 17 (వార్తాప్రభ) :** బాపట్ల జిల్లాలోని ఆహ్లా దకరమైన సూర్యలంక బీచ్‌లో సెప్టెంబర్ 26 నుంచి 28 వరకు మూడు రోజులపాటు అద్భుతమైన బీచ్ ఉత్సవం నిర్వాణ ఏర్పాట్లపై సంబంధిత శాఖల అధికారులతో మంత్రుల బృందం రాష్ట్ర సచివాలయంలో సమగ్రంగా చర్చిస్తున్నది. ప్రపంచ పర్యాటక దినోత్సవ వేడుకల అనుసంధానంగా నిర్వహించబడు తున్న నేపధ్యంలో ఈ వేడుకలను ఎంతో విజయవంతంగా నిర్వహించేందుకు పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర మంత్రులు కొలుసు పార్థసారథి, కొల్లు రవీంద్ర, అనగాని సత్యం ప్రసాద్, గొట్టిపాటి రవికుమార్, బాపట్ల కలెక్టర్ వినోద్ కుమార్ మరియు ఇతర శాఖల అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

# స్మార్ట్ సిటీ గా నూజివీడు

## -శరవేగంగా అభివృద్ధి - మంత్రి కొలుసు పార్థసారధి



**నూజివీడు,సెప్టెంబరు 17 (వార్తాప్రభ) :** రాష్ట్ర గృహ నిర్మాణ మరియు సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి పర్యటన లో భాగంగా గత వారం కురిసిన భారీ వర్షాలకు నీట మునిగిన ముంపు వార్డులు ఎన్, టి, ఆర్, కాలనీ, బాపు నగర్,మొఘల చెరువు,11వార్డుల్లో చేసిన పనులు పరిశీలించిన మంత్రి వర్యులు మాట్లాడుతూ నీట మునిగి నానా ఇబ్బందులు పడుతున్న ప్రజల కష్టాలు తీరుస్తూ, మురుగు నీటిని తొలగిస్తూ,సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టామని మున్సిపల్ సిబ్బంది యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టారన్నారు. ఎన్టీఆర్ కాలనీలో భారీ వర్షాల కారణంగా కొన్ని ఇళ్లలో నీరు చేరి ప్రజలు ఎటూ కదలలేని పరిస్థితిలో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజల కష్టాలను తక్షణమే పరిష్కరించామని త్వరలో డ్రైనేజి విద్యుత్ సమస్యలు తీరుస్తామన్న మంత్రివర్యులు. మున్సిపల్ సిబ్బంది. మునుపెన్నడూ లేని విధంగా చర వేగంగా శానిటేషన్ పనులు చేపట్టారన్నారు. మున్సిపల్ వార్డుల్లో ఎన్నో ఏళ్ళుగా తీరని మురుగునీరు వర్షపు నీటి సమస్య మునుపెన్నడూ లేని విధంగా తొలగించమన్నారు. వర్షపు నీరు జెసిపి తో మురుగు కాలువల చెత్త, మురుగు తొలగించి సాధ్యమైన మేరకు వర్షపు నీటిని తొలగించమన్నారు. పట్టణంలో గత 15 సంవత్సరాలుగా తీయని పూడిక, మురిగినీటి కాలువలు శుభ్రం చేయుట, గత 15 సంవత్సరాలుగా నిరుపయోగంగా ఉన్న ధోబి ఖాన ఇప్పుడు రజకులు ఎంతో ఆనందంగా ఉపయోగించుకుంటున్నారన్నారు.. గత 15 సంవత్సరాల నుండి శుభ్రం చేయని పట్టణ మంచి నీటి స్టోరేజ్ ట్యాంక్ శుభ్రం చేసి పట్టణ ప్రజలకు స్వేచ్ఛ మైన త్రాగునీరు అందించామన్నారు. పట్టణంలో అన్ని వార్డుల్లో మునుపెన్నడూ లేనివిదంగా డ్రైనేజి వ్యవస్థ మెరుగుపడిందని, పట్టణంలోని అన్ని వార్డుల్లో శానిటేషన్ వ్యవస్థ మెరుగుపడుందని, పట్టణంలో రూ. 5కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. సి, సి, రోడ్లు అభివృద్ధి, ఇండోర్ స్టేడియం అభివృద్ధి, ఎమ్, ఆర్, అప్పారావు కాలనీ కోట్లతో అభివృద్ధి,బైపాస్ రోడ్డు అభివృద్ధి, ఎన్, ఆర్, కాలనీ అభివృద్ధి,మున్సిపల్ శానిటేషన్ కోసం జె, సి, పి,సుమారు. రూ. 32 లక్షలతో కొనుగులు చేసి పట్టణ అభివృద్ధి కి బాటలు వేసామన్నారు. గతంలో అస్తవ్యస్తంగా ఉన్న అంగన్వాడీ, సచివాలయ వ్యవస్థ మెరుగుపడిందని ఇలా పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టామన్నారు. ప్రస్తుతం నూజివీడు పట్టణం అభివృద్ధి పధంలో నడుస్తుందని రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి చేస్తామన్నారు. పట్టణం మునుపెన్నడూ లేని విదంగా అభివృద్ధి, శానిటేషన్, వార్డుల శుభ్రత, మంచినీటి సధుపాయం,చెత్తశుభ్రం చేయుట ఇలా పలు కార్యక్రమాలను నేను ఇచ్చిన ఆదేశాలతో మున్సిపల్ సిబ్బంది చేపట్టారన్నారు. రానున్న రోజుల్లో నూజివీడు పట్టణాన్ని స్మార్ట్ సిటీగా దిద్దుతానన్నారు.. పేద ప్రజలకు ఎటువంటి కష్టాలు,ఇబ్బందులు పడకుండా ఒక సైనికుడిలా పనిచేస్తానని మంత్రి తెలిపారు.

## 'స్వస్థ నారి - సురక్షిత్ పరివార్ అభియాన్' ప్రారంభం



**తిరువూరు,సెప్టెంబరు 17 (వార్తాప్రభ) :** ప్రధాని నరేంద్ర మోడీ పుట్టినరోజు సందర్భంగా స్థానిక అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ లో 'స్వస్థ నారి - సురక్షిత్ పరివార్ అభయాన్' కార్యక్రమాన్ని వైద్యాధికారి డాక్టర్ రేష్మా బేగం ప్రారంభించారు. ఆయా విధమైన ఆరోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్న రోగులను ఆమె పరీక్షించి అవసరమైన మందులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలకు మెరుగైన ఆరోగ్యాన్ని అందించడంతోనే బలమైన భారతదేశం ఆవిష్కృతం అవుతుందన్నదే కార్యక్రమ ముఖ్య ఉద్దేశమన్నారు. అక్టోబర్ 2 వరకు 15 రోజులపాటు జరిగే ఈ పక్షోత్సవాల సందర్భంగా ప్రతిరోజు ఏర్పాటు చేసే ప్రత్యేక వైద్య శిబిరాలు, హెల్త్ క్లినిక్లలో ప్రసూతి, చిన్న పిల్లలు, కంటి, ఈ ఎన్ టీ, బీపీ, షుగర్, క్యాన్సర్, టీబీ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించడమే కాకుండా గర్భిణీ స్త్రీలకు వివిధ రకాల ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందించడంతోపాటు చిన్నారులకు టీకాలు కూడా వేస్తామని రేష్మా బేగం తెలిపారు. అంగన్వాడి సిబ్బందితో కలిసి పౌష్టికాహారం ప్రాధాన్యతపై ఏఎన్ఎంలు, వైద్య ఆరోగ్య సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పిస్తారని, అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ కే రవి, సీనియర్ ఏఎన్ఎం బి రమాదేవి, హెల్త్ సెక్రటరీలు, అంగన్వాడి కార్యకర్తలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

## గాండ్ల తెలికుల సంఘం ఫ్రూట్స్ పంపిణీ



**విస్సన్నపేట,సెప్టెంబరు 17 (వార్తాప్రభ) :** స్థానిక మండలంలో భారతదేశ ప్రధాని నరేంద్ర మోడీ 75వ జన్మదిన ఉత్సవ మహోత్సవ వేడుకలలో భాగంగా గాండ్ల తెలికుల సంఘం ఆధ్వర్యంలో రోగులకు ఫ్రూట్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు దళిత బహుజన ఐక్యవేదిక అధ్యక్షులు ముత్తం శెట్టి శ్రీనివాసరావు, తెలుగు యువత సీనియర్ నాయకులు ముత్తం శెట్టి వంశీ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ రాష్ట్ర నాయకులు శ్రీనివాసరావు మాట్లాడుతూ తమ రాష్ట్ర నాయకత్వం ఇచ్చిన ఆదేశాల మేరకు నరేంద్ర మోడీ 75వ జన్మదిన ఉత్సవ వేడుకల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించామని ఆయన చెప్పారు. బిజెపి జిల్లా నాయకురాలు పోలే శాంతి, మండల అధ్యక్షుడు జి మధు మాజీ అధ్యక్షురాలు సుమ, తిరువూరు ఏఎంసి డైరెక్టర్ అబ్బినేని చంద్రశేఖర బాబు తదితరులు ప్రభుత్వ ఆసుపత్రిలో ఫ్రూట్స్ రోగులకు అందించారు.

## విద్యుత్ ఉద్యోగుల నిరసన..




**కాకినాడ,సెప్టెంబరు 17 (వార్తాప్రభ) :** ఒప్పంద ఉద్యోగులను క్రమబద్ధీకరణ చేయాలని విద్యుత్ ఉద్యోగులు భోజన విరామ సమయంలో నిరసన వ్యక్తం చేశారు. విద్యుత్ ఉద్యోగుల సమస్యల పరిష్కరించడంలో విద్యుత్ సంస్థల యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని, సమస్యల పరిష్కారం కోసం దశల వారి ఉద్యమాలు చేపడుతున్నట్లు ఏపీఎస్ పిఓ జెఏసి కాకినాడ డివిజన్ చైర్మన్ వి.బాల కుమార్, విద్యుత్ శాఖ 1104 యూనియన్ అధ్యక్షులు జి శ్రీనివాస్ పేర్కొన్నారు.విద్యుత్ ఉద్యోగుల సమస్యల పరిష్కరించడంలో విద్యుత్ సంస్థల యాజమాన్యం తీరుకు నిరసనగా శుక్రవారం నుంచి రిలే నిరాహార దీక్షలు చేపడుతున్నట్లు తెలిపారు. బుధవారం కాకినాడ విద్యుత్ శాఖ కార్యాలయం వద్ద ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యుత్ ఉద్యోగుల కార్మికుల ఉమ్మడి కార్యచరణ కమిటీ ఆధ్వర్యంలో కాకినాడ డివిజన్ కన్వీనర్ బి పైడి రాజు అధ్యక్షతన ధర్నా కార్యక్రమం చేపట్టారు. గత రెండు రోజుల నుంచి విద్యుత్తు ఉద్యోగుల సమస్య పరిష్కరించాలని నల్ల బ్యాడ్జీలతో నిరసన కార్యక్రమాలు చేపట్టామన్నారు. 22వ తేదీన అన్ని జిల్లా కేంద్రాల్లో ర్యాలీ నిర్వహించి కలెక్టర్కు వినతిపత్రం ఇవ్వడం జరుగుతుందన్నారు. అదేవిధంగా విద్యుత్ ఉద్యోగుల పెన్షనర్లకు వారి కుటుంబ సభ్యులకు పూర్తి వైద్య ఖర్చులు చెల్లించాలన్నారు. కాంట్రాక్ట్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. దీర్ఘకాలంగా సర్వీస్ చేస్తున్న వారందరినీ విద్యుత్ శాఖలో విలీనం చేయాలన్నారు. ప్రభుత్వంతో ఒప్పందం ప్రకారం అమల్లో ఉన్న ఆటోమేటిక్ అడ్వాన్స్మెంట్ స్కీం ప్రకారం పేస్కేలు రూపొందించాలన్నారు. ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జగ్గంపేట జేఏసీ చైర్మన్ మురళీకృష్ణ, కన్వీనర్ ఎన్ఎస్ నాయుడు, పెద్దాపురం జేఏసీ నాయకులు కె. బాబి, జిఎస్ సుందర్రావు, డి సింహాచలం, కె.వి రమణ అధిక సంఖ్యలో ఉద్యోగులు పాల్గొన్నారు.

## నడుపూరు లో స్వస్త నారీశాసక్త్ పరివార్ అభియాన్



**పెడన,సెప్టెంబరు 17 (వార్తాప్రభ) :** స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ పేరుతో ఆడబిడ్డల ఆరోగ్యం కోసం, కేంద్రం మెడికల్ టెస్ట్ లు తీసుకురావడం మంచి కార్యక్రమం అని జడ్పీటీసీ అర్జా వెంకట నగేష్ అన్నారు.ఈకార్యక్రమం బుధవారం నాడు పెడన మండలం నడుపూరు గ్రామంలో జరిగింది. ఈకార్యక్రమంలో వైద్య ఆరోగ్య సిబ్బంది నీటిసంఘం అధ్యక్షులు పరసా వెంకటేశ్వరావు (చిన్నా )గ్రామ టీడీపీ అధ్యక్షులు కన్నెపోటి సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# కామినేనిలో అత్యంత క్లిష్టమైన మోకీలు మార్పిడి శస్త్రచికిత్స

- 110 కిలోల బరువున్న 65 ఏళ్ల మహిళకు విజయవంతంగా మోకీలు మార్పిడి
- ఆర్థోపెడిక్, ట్రామా అండ్ జాయింట్ రీప్లేస్మెంట్ సర్జన్ డాక్టర్ షణ్ముఖ్ తూమాటికి అభినందనలు వెల్లువ
- కామినేనిలో వివిధ వైద్య విభాగాలు ఒకేచోట ఉండటంతో మెరుగైన చికిత్సా అవకాశాలు
- కామినేని మెడికల్ డైరెక్టర్ డాక్టర్ ఎన్ఆర్ఎస్ వర్ధన్




**విజయవాడ,సెప్టెంబరు 17 (వార్తాప్రభ) :** నగరంలోని కామినేని హాస్పిటల్ నందు అత్యంత సంక్లిష్టమైన మోకీలు మార్పిడి శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించారు. 110 కేజీల బరువున్న 65 ఏళ్ల మహిళకు మోకీలు మార్పిడి శస్త్రచికిత్సను నిర్వహించిన ఆర్థోపెడిక్, ట్రామా అండ్ జాయింట్ రీప్లేస్మెంట్ సర్జన్ డాక్టర్ షణ్ముఖ్ సరికొత్త రికార్డు సృష్టించారు. సాధారణంగా ఇంత ఎక్కువ బరువున్నవారికి.. అందునా, మెదడులో రక్తం గడ్డ కట్టిన వ్యక్తికి.. ఈ తరహా మోకీలు మార్పిడి సాధ్యపడదు. అయితే, డాక్టర్ షణ్ముఖ్.. ఈ చికిత్సను విజయవంతంగా పూర్తిచేసి.. మరుసటి రోజే పేషెంట్ సాధారణంగా నడిచేలా చేయగలిగారు. ఈ అత్యంత అరుదైన, అతి సంక్లిష్టమైన శస్త్రచికిత్సకు సంబంధించిన వివరాలను తెలియజేసేందుకు బుధవారం నాడు మీడియా సమావేశం ఏర్పాటుచేశారు. నగరంలోని ఇంద్రప్రస్థ హోటల్లో జరిగిన ఈ సమావేశంలో కామినేని మెడికల్ డైరెక్టర్ డాక్టర్ ఎన్ఆర్ఎస్ వర్ధన్ మాట్లాడుతూ.. అసాధ్యమనుకున్న చికిత్సను విజయవంతంగా నిర్వహించిన డాక్టర్ షణ్ముఖ బాబును అభినందించారు. కామినేని హాస్పిటల్స్ నందు అత్యాధునిక మల్టీ స్పెషాలిటీ సేవలు అందుబాటులో ఉండటంతో చికిత్స అవకాశాలు మెరుగ్గా ఉంటాయని అన్నారు. అత్యంత అనుభజ్ఞులైన వైద్య నిపుణులు, అత్యాధునిక వైద్య సంపత్తితో కామినేనిలో అంతర్జాతీయ స్థాయి వైద్య చికిత్సలను అందిస్తున్నామని డాక్టర్ వర్ధన్ వెల్లడించారు. అనంతరం, డాక్టర్ షణ్ముఖ్ తూమాటి మాట్లాడుతూ.. 'మోకాలి నొప్పితో నడవలేని స్థితిలో ఉన్న 65 ఏళ్ల మహిళకు నీ రీప్లేస్మెంట్ సర్జరీ నిర్వహించాం. పేషెంటుకు బ్రెయిన్ లో చిన్న క్లాట్ కూడా వుంది. ఈ పరిస్థితుల్లో మోకీలు మార్పిడి శస్త్రచికిత్స చేయడం కుదరకపోవచ్చు. అయితే, హాస్పిటల్లోని వివిధ విభాగాల వైద్యుల సహకారంతో, బహుళ వైద్య సేవలను అందుబాటులో ఉంచుకుని అత్యంత క్లిష్టమైన ఈ శస్త్రచికిత్సను నిర్వహించాం. శస్త్రచికిత్స విజయవంతమై.. చికిత్స చేసిన మరుసటి రోజు నుండి పేషెంట్ సాధారణంగా నడవగలుగుతున్నారు' అని వివరించారు. కామినేనిలోని అడ్వాన్స్ ట్రామా సెంటర్ నందు అనేక క్లిష్టమైన చికిత్సలను నిర్వహిస్తూ వస్తున్నామని, వేరే ఆసుపత్రుల్లో చికిత్స చేయలేకపోయిన కేసుల్లో సైతం విజయవంతంగా చికిత్స చేసి.. అనేకమంది ప్రాణాలను కాపాడగలిగామని తెలిపారు. అన్ని విభాగాలు ఒకేచోట ఉండటంతో కామినేని హాస్పిటల్ మెరుగైన వైద్య చికిత్సలను అందించడంలో ముందంజలో ఉందని డాక్టర్ షణ్ముఖ్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో కామినేని క్లస్టర్ హెడ్ పి. సునీల్ కుమార్, మార్కెటింగ్ హెడ్ రమణారావు పాల్గొన్నారు.

# జర్నలిస్టులకు శిక్షణ తరగతులు నిర్వహించండి

**- ప్రెస్ అకాడమీ చైర్మన్ కు జర్నలిస్ట్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యక్షుడు అనిల్ కుమార్ రెడ్డి విజ్ఞప్తి**



**విజయవాడ,సెప్టెంబరు 17 (వార్తాప్రభ) :** జర్నలిస్ట్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (జాప్) ఆధ్వర్యంలో ఉమ్మడి అనంతపురం జిల్లా జర్నలిస్టులకు శిక్షణ తరగతులు నిర్వహించాలని జాప్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొత్తపల్లి అనిల్ కుమార్ రెడ్డి ఆంధ్రప్రదేశ్ సీఆర్ ప్రెస్ అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేష్ కుమార్ ను కోరారు. ఈ మేరకు ఆయన బుధవారం అకాడమీ చైర్మన్ ను విజయవాడలోని ఆయన కార్యాలయంలో కలిసి ఓ వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా అనిల్ కుమార్ రెడ్డి.. సీఆర్ ప్రెస్ అకాడమీ చైర్మన్ తో మాట్లాడుతూ.. రాష్ట్రంలో అర్హత గల జర్నలిస్టులందరికీ వెంటనే నూతనంగా అక్రిడేషన్లు మంజూరు చేయాలని, జర్నలిస్టుల సమస్యలు "జర్నలిస్టుల పెద్దన్న" గా ముఖ్యమంత్రి, సమాచార మంత్రి తో చర్చించి తక్షణమే పరిష్కరించాలని అనిల్ కుమార్ రెడ్డి కోరారు. అదే విధంగా "జాప్" ద్వారా ఉమ్మడి అనంతపురం జిల్లా జర్నలిస్టులకు శిక్షణ తరగతులు నిర్వహించాలని కోరారు. ఇందుకు ప్రెస్ అకాడమీ చైర్మన్ స్పందిస్తూ త్వరలో అకాడమీ ఆధ్వర్యంలో శిక్షణ తరగతులు ఏర్పాటు చేస్తామని జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# రోగులు పండ్లు పంపిణి



**కృత్తివెన్ను,సెప్టెంబరు 17 (వార్తాప్రభ) :** భరతమాత ముద్దుబిడ్డ ప్రపంచ దేశాలలో భారతదేశాన్ని అత్యున్నత స్థానంలో నిలిపిన మన ప్రధాని మంత్రి నరేంద్ర మోడీ 75వ జన్మదిన సందర్భంగా ఈరోజు సీతనపల్లి ప్రధాన సెంటర్లో నరేంద్ర మోడీ చిత్రపటం వద్ద కేకు కట్ చేసి విద్యార్థులకు తినుబండారులు పంపిణీ చేసారు తదనంతరం సీతనపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద మరియు మల్లేశ్వరం ప్రభుత్వ ఆసుపత్రి వద్ద రోగులకు పండ్లు పంపిణీ చేయడం జరిగినది ఈ కార్యక్రమంలో పాల్గొన్న డి.సి చైర్మన్ నెక్కంటి భాస్కర్ రావు , శ్రీ దుర్గా పార్వతీ సమితి నాగేశ్వర స్వామి వారి దేవస్థానం ట్రస్ట్ బోర్డు చైర్మన్ చేకూరి వెంకట్రావు ,తెలుగుదేశం మండల ప్రధాన కార్యదర్శి పిన్నింటి రత్తయ్య భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షుడు కుక్కిలిగడ్డ యేసు రాజు, భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు దేవస్థానం ట్రస్టు బోర్డు మేంబరు దాసరి వెంకట శ్రీనివాస్ మార్కెట్ యాడ్ డైరెక్టర్ బండిరెడ్డి రామాంజనేయులు పి రసింహారావు మాట్లాడుతూ శ్రీ నరేంద్ర మోడీ ప్రధానిగా అధికారం చేపట్టినప్పటి నుంచి సాధించిన విజయాలను ప్రజలకు వివరించటం జరిగినది. ఈ కార్యక్రమంలో భాజపా నాయకులు ఇల్లూరి సుబ్బారావు , కన్నా సుబ్బయ్య వడ్డీ కాసులు , కూనసాని హరిబాబు,పాశం శ్రీను, ప్రతి రామాంజనేయులు%ం%. మారుతి, ఏం రామాంజనేయులు, మరియు భాజపా నాయకులు కార్యకర్తలు తెలుగుదేశం నాయకులు కార్యకర్తలు జనసేన నాయకులు కార్యకర్తలు ప్రజలు విరివిగా పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేసినారు.

# సిపిఎస్ ఉద్యోగులు ఉపాధ్యాయుల డి.ఏ. బకాయిల చెల్లింపుపై హైకోర్టు ఆదేశాలు

- రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేయాలని విజ్ఞప్తి
- నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్

**విజయవాడ,సెప్టెంబరు 17 (వార్తాప్రభ) :** రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయుల డి.ఏ. బకాయిల చెల్లింపుపై గౌరవనీయ హైకోర్టు 24.06.2024న W.P.No.12039/2024లో స్పష్టమైన ఆదేశాలు జారీ చేసిందనీ ఆ తీర్పు ప్రకారం సి.ఎఫ్.ఎం.ఎస్. నంబర్ల కింద రూపొందించిన బిల్లులను 4 వారాలలోగా, మిగతా మొత్తాలను 8 వారాలలోగా ఉద్యోగుల ఖాతాలలో జమ చేయాలని ప్రభుత్వం కు ఆదేశాలు జారీ చేయబడ్డాయి.కానీ హైకోర్టు విచారణ అనంతరం సచివాలయ ఉద్యోగులకు కొంతమేర బకాయిలు చెల్లించబడ్డాయనీ సహజ న్యాయ సూత్రాల కు అనుగుణంగా సచివాలయ సిపిఎస్ ఉద్యోగులకు చెల్లించినట్లే రాష్ట్రం లోని మిగిలిన సిపిఎస్ ఉద్యోగ ఉపాధ్యాయులందరికీ 2018 జూ లై మరియు 2019 జనవరి డి.ఏ. బకాయిలు వెంటనే చెల్లించాలనీ నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కరణం హరికృష్ణ మరియు మాగంటి శ్రీనివాస రావు లు లేఖ ద్వారా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కి విజ్ఞప్తి చేసినట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.ఇప్పటికే 2018 జూలై నుండి 2021 జూన్ వరకు డి.ఏ. బకాయిలకు సంబంధించిన బిల్లులు సి.ఎఫ్.ఎం.ఎస్. లో రూపొందించబడ్డాయనీ,. అయితే వాటి చెల్లింపులు ఇంకా ఉద్యోగుల ఖాతాల్లో జమ కాలేదనీ వారు ఆ లేఖ లో పేర్కొన్నారు. అంతేకాక, మిగిలిన కాలానికి సంబంధించిన బిల్లులు ఇంకా రూపొందించబడకపోవడం వల్ల రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఆశతో ఎదురుచూస్తున్నారనీ వారు తెలిపారు.గతంలో హైకోర్టు విచారణ అనంతరం సచివాలయ ఉద్యోగులకు కొంతమేర బకాయిలు చెల్లించబడ్డాయనీ, ఇదే విధంగా రాష్ట్రంలోని మిగిలిన ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు కూడా సమాన న్యాయం జరగాలని నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్ విజ్ఞప్తి చేసింది

**మా విజ్ఞప్తులు:** 1. హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులపై సమగ్రంగా అమలు చేయాలి. 2. ఇప్పటికే CFMS నంబర్ల కింద రూపొందించిన బిల్లులను వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకోవాలి. 3. మిగిలిన కాలానికి సంబంధించిన బిల్లులు త్వరితగతిన రూపొందించి, ఉద్యోగులందరికీ ఒకే విధమైన ప్రయోజనం కల్పించాలి. మా విజ్ఞప్తిని గౌరవనీయ ప్రభుత్వం పరిగణనలోకి తీసుకొని, రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయుల న్యాయమైన హక్కులు సాధ్యమయ్యేలా తక్షణ చర్యలు చేపడతారని హృదయపూర్వకంగా విశ్వసిస్తున్నామన్నారు.

## సచివాలయం నుంచి పాఠశాలకు టీచర్ కొలువు సాధించిన గాజుల ధనలక్ష్మి



**పెడన,సెప్టెంబరు 17 (వార్తాప్రభ) :** పట్టుదల ఉంటే సాధించనిది ఏమీ ఉండదు అని నిరూపించింది పెడన మండలం చెన్నూరు గ్రామానికి చెందిన గాజుల ధనలక్ష్మి. వివాహిత అయి ఇద్దరు పిల్లలు ఉండి కూడా అనుకున్న లక్ష్యాన్ని చేరుకుంది రైతు కుటుంబానికి చెందిన లక్ష్మీనారాయణ కుమారి దంపతుల కూతురు ధనలక్ష్మి ఇటీవల నిర్వహించిన డీఎస్సీలో విజేతగా నిలిచి లెక్కల మాస్టారుగా ఎంపికయింది.బి ఎస్ సి బిఇడి చదివి పెడన పట్టణంలోని సచివాలయంలో ఉద్యోగం చేస్తూ ఉంది. ఆ ఉద్యోగం ఆమెకు సంతృప్తిని ఇవ్వలేదు. చదివిన చదువుకు చేస్తున్న ఉద్యోగంకు సంబంధం లేకపోవడంతో ఎలాగైనా ఉపాధ్యాయునిగా ఎంపిక కావాలని పట్టుదలతో ప్రయత్నించి విజేతగా నిలిచింది. ఈనెల 19వ తేదీన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదగా నియామకపు ఉత్తర్వులను అందుకోనుంది.

## బల్లిపర్రు లో మనడబ్బు మనలెక్కలు..

**-కొత్త యాప్ పైఅవగాహనా సదస్సు**



**పెడన,సెప్టెంబరు 17 (వార్తాప్రభ) :** డ్వాక్రా సంఘాల నిర్వహణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టడమే కాకుండా మహిళలు తమకాళ్ల పై తాము నిలబడే విధంగా చేయడానికి సిద్ధంగా ఉందని జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ హరిహర నాద్ అన్నారు. మన డబ్బు మన లెక్కలు అనే కార్యక్రమం పై మంగళవారం నాడు పెడన మండలం బల్లిపర్రు గ్రామంలో డ్వాక్రా మహిళలకు కొత్తగా రూపొందించిన యాప్ పై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా పిడి మాట్లాడారు. జడ్పిటిసి అర్జా వెంకట నగేష్ ఐబి జిల్లా మేనేజర్ సత్యభామ కూడా డ్వాక్రా మహిళలను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు అర్జా నాగలక్ష్మి ఉప సర్పంచ్ వాసన కుమారస్వామి ఎ పి ఎం శ్రీదేవి సీసీ లు కుంచె వెంకటేశ్వర్లు సుజాత తదితరులు పాల్గొన్నారు

## ఘనంగా ప్రధానమంత్రి జన్మదిన వేడుకలు



**కృత్తివెన్ను,సెప్టెంబరు 17 (వార్తాప్రభ) :** భారతదేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడి 75వ జన్మదినోత్సవ వేడుకలు కృత్తివెన్ను మండలం లోని సీతనపల్లి సెంటర్లో బుధవారం ఘనంగా నిర్వహించారు. కూటమి నాయకులు పాల్గొని కేక్ కట్ చేసి భానోదయ పబ్లిక్ స్కూల్ చిన్నారులకు మిఠాయిలు బిస్కెట్లు పళ్ళు అందజేశారు. అలాగే కృత్తివెన్ను ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని రోగులకు పళ్ళు అందజేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు భాజపా సీనియర్ నాయకుడు దాసరి శ్రీనివాసరావు తెదేపా మండల ప్రధాన కార్యదర్శి పిన్నెంటి రత్తయ్య డీసీ ఛైర్మన్ నెక్కంటిబాస్కరావు దేవస్థానం ఛైర్మన్ చేకూరి వెంకట్రావు పుప్పాల నరసింహారావు యాదంరెడ్డి కొండ భాజపా మండల అధ్యక్షుడు కొక్కిలిగడ్డ ఏసు రాజు బండ్రెడ్డి ఆంజనేయులు ఇల్లూరి సుబ్బారావు ప్రత్తిరాము తోటరాధాకృష్ కన్నా సుబ్బయ్య, కాను మల్లి పురుషోత్తం తదితరులు పాల్గొని మాట్లాడారు. భారతదేశానికి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చేసిన చేస్తున్న సేవలను కొనియాడారు. భారతదేశం అభివృద్ధి పథంలో ముందుకు దూసుకుపోతుందంటే అది మోడీ నాయకత్వం వల్లే అని అన్నారు. మన దేశానికి ఎంత ముఖ్యమో మన రాష్ట్రానికి కూడా మోడీజీ అంతే ముఖ్యం అన్నారు.ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గ ఆధ్వర్యంలో రాష్ట్రం అభివృద్ధి చెందడంలో మోడీ పాత్ర ముఖ్యమైందని పేర్కొన్నారు. అటు పోలవరం, ఇటు రాజధాని నిర్మాణంలో చేయందిస్తున్న మోడీ గర్వ కారణమని అన్నారు కూటమి నాయుకులు కార్యకర్తలు అలాగే పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.

## అంటూ రోగాలు అరికట్టేందుకు చర్యలు

**-గ్రామ సర్పంచ్ సాదుపాటి నాగమల్లేశ్వరి కోటేశ్వరరావు**



**విస్సన్నపేట,సెప్టెంబరు 17 (వార్తాప్రభ) :** స్థానిక మండల కేంద్రంలో డెంగ్యూ మలేరియా వంటి విష జ్వరాలు ప్రబలకుండ విస్సన్నపేట గ్రామ సర్పంచ్ సాదుపాటి నాగమల్లేశ్వరి కోటేశ్వరరావు ప్రత్యక్ష పర్యవేక్షణలో బ్లీచింగ్ చలించే కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు కోటేశ్వరరావు గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సేవా కార్యక్రమాలు స్ఫూర్తిదాయకం



**గన్నవరం,సెప్టెంబరు 17 (వార్తాప్రభ) :** మానవత స్వచ్ఛంద సేవా సంస్థ గన్నవరం శాఖ ఆధ్వర్యంలో 40 డస్ట్ బిన్ లను రెండు ట్రాలీలను గన్నవరం రైతు బజార్ ఎస్టేట్ ఆఫీసర్ కి మరియు రైతులకు డ్వాక్రా సభ్యులకు మరియు వ్యాపారులకు అందజేయడమైనది.ఈ కార్యక్రమంలో మానవత చైర్మన్ మదుపల్లి బాలకృష్ణమూర్తి, కన్వీనర్ కర్రా వరప్రసాద్, అధ్యక్షుడు వీసం ప్రసాదరావు, కార్యదర్శి వి వి కృష్ణ మోహన్, కోశాధికారి పొట్లూరు రామకృష్ణారావు, గౌరవ డైరెక్టర్లు గన్నే వెంకటరావు ముక్కామల సుబ్బారావు సంయుక్త కార్యదర్శి వడ్లమూడి వెంకటేశ్వరరావు, ముఖ్య అతిథి కలపాల శ్రీనివాస్ డీజీఎం పతంజలి ఫుడ్స్ లిమిటెడ్, అంపాపురం, రైతు బజారు ఎస్టేట్ ఆఫీసర్ శ్రీనివాస్ మానవత సభ్యులు మాగంటి శ్రీనివాస రావు(రు.5000లు డస్ట్ బిన్ల దాత ) పాల్గొన్నారు. రెక్టం క్యాన్సర్ తో బాధపడుతున్న ఉంగుటూరు గ్రామానికి చెందిన డోలా సన్యాసినాయుడు కు స్టూల్ బాగ్స్ కొరకు ఆర్థిక సహాయం రూ. 3000, లు మానవత స్వచ్ఛంద సేవా సంస్థ గన్నవరం శాఖ సభ్యులు అందజేశారు.

## మోపిదేవి శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారిని దర్శించుకున్న ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమల రావు.



**మోపిదేవి/అవనిగడ్డ,సెప్టెంబరు 17 (వార్తాప్రభ) :** కృష్ణా జిల్లా,మోపిదేవిలో వేంచేసియున్న శ్రీవల్లీ దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి దేవస్థానాన్ని ఆర్టీసీ ఎండి ద్వారకా తిరుమలరావు బుధవారం దర్శించుకున్నారు.స్వామివారి దర్శనానికి ఆలయానికి విచ్చేసిన ఆర్టీసీ ఎండి ద్వారకా తిరుమలరావుకు ఆలయ డిప్యూటీ కమిషనర్, ఆలయ కార్యనిర్వాహణ అధికారి దాసరి శ్రీరామ వరప్రసాదరావు , సూపరింటెంట్ బొప్పన సత్యనారాయణ , ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయ ఆవరణలో గల నాగపుట్టలో పాలు పోసి మొక్కుబడులు చెల్లించుకున్న అనంతరం, గర్భాలయంలో కొలువుదీరిన శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు ఆలయ అర్చకులు ఆశీర్వచనాలు అందజేశారు. అనంతరం ఆర్టీసీ ఎండి ద్వారకా తిరుమలరావును ఆలయ మర్యాదలతో ఘనంగా సత్కరించి, ప్రసాదాలు ,శ్రీ స్వామి వారి చిత్రపటాన్ని ఆలయ డిప్యూటీ కమిషనర్ దాసరి శ్రీరామ వరప్రసాదరావు అందజేశారు. ఈ సందర్భంగా ద్వారకా తిరుమలరావు మాట్లాడుతూ మోపిదేవి శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం చారిత్రక, ఆధ్యాత్మిక విశిష్టతలను ప్రశంసించారు. ప్రజల అభ్యుదయానికి, సమాజ శ్రేయస్సుకు స్వామివారి కటాక్షం ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు.

# దళిత విద్యార్థి నాయకుల పై అక్రమ కేసులను ఖండిస్తున్నాం

*దళిత విద్యార్థి నాయకులపై అక్రమ కేసులు పెట్టిన తొర్రూరు డి.ఎస్.పి కృష్ణ కిషోర్ పై చర్యలు తీసుకోవాలి ఉస్మానియా యూనివర్సిటీ జేఏసీ చైర్మన్ తిరుపతి డిమాండ్*



**తొర్రూర్ సెప్టెంబర్ 17(వార్తా ప్రభ)**మహబూబాబాద్ జిల్లా లో సుమారు 15 సంవత్సరాలుగా దళిత విద్యార్థి సంఘల నాయకులైన పంతం విజయేందర్, వెలిశాల శ్యామ్ లపై అక్రమంగా కేసులు పెట్టి పోలీస్ స్టేషన్లో మాదిగ మాల లంజా కొడుకుల్లారా మీకెందుకురా ఉద్యమాలు అని బూటు కాలుతో తన్ని ఘోరంగా తిడుతూ కొట్టుతూ మా జాతిని అవమానించిన తొర్రూర్ డిఎస్పి కృష్ణ కిషోర్ పై చర్య తీసుకోవాలని ఉస్మానియా యూనివార్సిటీ చైర్మెన్ తిరుపతి అన్నారు, ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని చట్టరీత్య చర్యలు తీసుకోవాలని కోరారు. దళిత జాతిని దళితులను అవమానించిన డీఎస్పీ కృష్ణ కిషోర్ పై దళిత సంఘాలు స్పందించాలని కోరారు. డిఎస్పి పై చర్యలు తీసుకొని ఎడల ఉస్మానియా యూనివర్సిటీ వేదికగా పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు.ఓయూ నాయకులు గోరేటి రమేష్,రాము,వేల్పూగొండ సురేష్, సంపత్ తదితరులు పాల్గొన్నారు

## జాతీయ జెండాను ఎగురవేసి, రక్తదాన శిబిరంలో పాల్గొన్న బిజెపి నేత చెరుకుపల్లి









**కుత్బుల్లాపూర్ సెప్టెంబర్ 17 (వార్తాప్రభ)** : తెలంగాణ విమోచన దినోత్సవం పురస్కరిం చుకొని కుత్బుల్లాపూర్ నియోజక వర్గం 132 జీడిమెట్ల డివిజన్ పరిధిలోని అయోధ్య నగర్ లో బుధవారం బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత్ సింహ రెడ్డి జాతీయ పతాకాన్ని ఎగరవేశారు. కార్యక్రమం లో బీజేపీ డివిజన్ అధ్యక్షులు జోగిని రాజు,నార్లకాంటి ప్రతాప్,నల్లనాగుల కృష్ణ,పెద్దింటి సాయిలు,ప్రభాకర్ రెడ్డి,పోల గంగాధర్,పాపయ్య దొర,పద్మా రెడ్డి,అంజయ్య,వీరేశం,శ్రవణ్ బోస్,మహేష్, వెంకట్,క్రాంతి,మహేందర్,శ్రవణ్,మూర్తి,శివ తదితరులు పాల్గొన్నారు.

**కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజనాథ్ సింగ్ ని కలిసిన చెరుకుపల్లి భరత్ సింహ రెడ్డి** భారతీయ జనతా పార్టీ పెరేడ్ గ్రౌండ్ లో నిర్వహించిన తెలంగాణ విమోచన దినోత్సవ కార్యక్రమం లో పాల్గొని తదుపరి భారత్ ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినం పురస్కరించుకొని బీజేవైఎం ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరం లో బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత్ సింహ రెడ్డి పాల్గొని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజనాథ్ సింగ్ చేతుల మీదుగా సర్టిఫికెట్ అందుకున్నారు.

### జవహర్‌నగర్‌లో విశ్వకర్మ యజ్ఞ మహోత్సవానికి హాజరైన మేడ్చల్ నియోజకవర్గ

## కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జితోటకూర వజ్రేష్ యాదవ్



**జవహర్ నగర్, సెప్టెంబర్ 17:( వార్తా ప్రభ)** జవహర్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని శ్రీ విరాట్ విశ్వ బ్రహ్మణ సంఘం ఆధ్వర్యంలో శ్రీ విరాట్ విశ్వకర్మ యజ్ఞ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించబడిందిఈ మహోత్సవానికి నిర్వాహకుల ఆహ్వానం మేరకు మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి తోటకూర వజ్రేష్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై, ఇతర నాయకులతో కలిసి ప్రత్యేక పూజల్లో హెూమం కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ విశ్వకర్మ కులస్తులు ఈ దేశ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తున్నారు.దేశ అభివృద్ధిలో కార్మికులు, కళాకారులు,వృత్తిదారుల పాత్రను ఎప్పటికీ మరిచిపోలేం.విశ్వకర్మ జయంతి వంటి మహోత్సవాలు మన సంస్కృతిని,సంప్రదాయాన్ని చాటుతూ,సమాజంలో సామరస్యం పెంచే కార్యక్రమాలుగా నిలుస్తున్నాయి అని అన్నారు.అలాగే,విశ్వ బ్రహ్మణ సంఘం చేస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలను ప్రశంసిస్తూ,తాను ఎల్లప్పుడూ వారి అభివృద్ధికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ మేకల కావ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బోంగునూరి శ్రీనివాస్ రెడ్డి, మేడ్చల్ మార్కెట్ చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహులు యాదవ్, జిల్లా ఆర్టీఏ మెంబర్ భీమిడి జైపాల్ రెడ్డి, జవహర్‌నగర్ మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లెపూల శ్రీకాంత్ యాదవ్, మాజీ సర్పంచ్ శంకర్ గౌడ్, మాజీ కార్పొరేటర్లు, మాజీ కోఆప్షన్ సభ్యులు, మాజీ ప్రజా ప్రతినిధులు,కాంగ్రెస్ నాయకులు,విశ్వకర్మ కుల పెద్దలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# సరిలేరు మీకెవ్వరు మోదీజీ!!

**● ప్రపంచ దేశాలు గౌరవించే ఏకైక నాయకుడు మోడీ ● దేశ ప్రగతి, రక్షణ రెండు కళ్ళుగా ప్రధాని పాలన ● మోడీ పుట్టినరోజు ప్రతి ఒక్కరి హృదయాన్ని తట్టే పండుగ ● రామగుండం బిజెపి ఇంచార్జి కందుల సంధ్యారాణి**







**పెద్దపల్లి/ అంతర్గాం: సెప్టెంబర్ 17 (వార్తాప్రభ ప్రతినిధి)**సరిలేరు మీకెవ్వరు మోదీజీ అని రామగుండం బిజెపి ఇంచార్జి కందుల సంధ్యారాణి దేశ ప్రధానిపై ప్రశంసల జల్లు కురిపించారు. ఈ మేరకు బుధవారం ప్రధాని మోడీ జన్మదినం సందర్భంగా అంతర్గాం మండలం బిజెపి పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన సేవా కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా సంధ్యారాణి హాజరై కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా సంధ్యారాణి మీడియాతో మాట్లాడుతూ....... ప్రధాని మోడీ జన్మదిన సందర్భంగా 15 రోజులు సేవా కార్యక్రమాలను పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు మొదటి రోజున అంతర్గాం ప్రభుత్వ ఆసుపత్రిలో బిజెపి నేత సుభాష్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రక్తదానం చేసినటువంటి యువతకు లయన్స్ క్లబ్ సభ్యులు సర్టిఫికెట్స్ ప్రధానం చేసినట్లు తెలిపారు. ప్రపంచ దేశాలు గౌరవించే ఏకైక నాయకుడు మోడీ అని దేశ ప్రగతి, రక్షణ రెండు కళ్ళుగా ప్రధాని పాలన సాగిస్తున్నారు అని కొనియాడారు. మోడీ పుట్టినరోజు ప్రతి ఒక్కరి హృదయాన్ని తట్టే పండుగ అని తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అపర్ణ, వీరేశం, సత్యం, ఎల్లప్ప, సారయ్య, పవన్, లక్ష్మణ్, రాము, నవీన్, రమేష్, వంశీ, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# కమలం పువ్వుపై వికసించిన కోమళ్ళ!!

**● ఉద్యమ నేతకు బిజెపిలో పట్టం ● జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియామకం ● తెలంగాణలో ప్రభుత్వ ఏర్పాటు లక్ష్యంగా పనిచేస్తా ● పెద్దపల్లి జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శి కోమల్ల మహేష్**



**పెద్దపల్లి/ గోదావరిఖని: సెప్టెంబర్ 17 (వార్తాప్రభ ప్రతినిధి)**కమలం పువ్వుపై వికసించిన కోమళ్ళ, ఉద్యమ నేత మహేష్ కు బిజెపిలో పట్టం. వివరాల్లోనికి వెళితే అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ దశ నుండి బిజెపి యువ మోర్చా, బీజేపీ పార్టీ వరకు కీలకంగా వ్యవహరించి పార్టీ ఇచ్చిన పిలుపుమేర ధర్నాలు, నిరసనలు, ఉద్యమాలలో చురుగ్గా పాల్గొన్న గోదావరిఖని పారిశ్రామిక ప్రాంతానికి చెందిన కోమల్ల మహేష్ ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా తన అభిమానులు నేరుగా, సోషల్ మీడియా వేదికగా శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. ఎన్నిక కావడం పట్ల కోమల్ల మహేష్ మీడియాతో మాట్లాడారు. కష్టానికి తగిన ఫలితం ఒక భారతీయ జనతా పార్టీలోనే లభిస్తుంది అని అన్నారు. తెలంగాణలో ప్రభుత్వ ఏర్పాటు లక్ష్యంగా పనిచేస్తా అని తన కాన్ఫిడెన్స్ వ్యక్తపరిచారు. తన నియమకానికి కృషి చేసిన ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేసింది నాటి సీఎం కేసీఆర్!!

**● రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసింది బీఆర్ఎస్ ప్రభుత్వం ● ప్రజల కోసం అహర్నిశలు పాటుపడింది కేసీఆర్, కేటీఆర్ ● కులమతాలకు అతీతంగా ఐక్యతే లక్ష్యంగా కేసీఆర్ పాలన ● కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవాలి ● రామగుండం మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు కోరుకంటి చందర్**







**పెద్దపల్లి: సెప్టెంబర్ 17 (వార్తాప్రభ ప్రతినిధి)**ప్రజల సంక్షేమానికి పెద్దపీట వేసింది నాటి సీఎం కేసీఆర్ గత బీఆర్ఎస్ ప్రభుత్వం అని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు కోరుకంటి చందర్ అన్నారు. బుధవారం పెద్దపల్లి బీఆర్ఎస్ కార్యాలయంలో జాతీయ సమైక్యత దినోత్సవం ఘనంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే జాతీయ జెండాను ఆవిష్కరించారు. తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో తీసుకెళ్లిన ఘనత మాజీ సీఎం కేసీఆర్ కి దక్కుతుందన్నారు. దేశ ఐక్యత, సమగ్రత కాపాడాలని సూచించారు. కులమతాలకు అతీతంగా ఐక్యతే లక్ష్యంగా కేసీఆర్ పాలన సాగించారని సంతోషం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీల నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ వేడుకలలో పెద్దపల్లి పట్టణ అధ్యక్షులు రాజ్ కుమార్, చంద్రశేఖర్, మారుతి, జావేద్ రవీందర్ మధు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్టీపీసీలో ఘనంగా విశ్వకర్మ పూజ!!

**● యంత్రాలు, సాధనాలను గౌరవించే సాంస్కృతిక పండుగ ● "కమ్యూనిటీ స్పిరిట్"తో విజయాలు సాధించాలి ● భారతదేశ విద్యుత్ రంగానికి అత్యున్నత ప్రమాణం ఎన్టీపీసీ ● ఎన్టీపీసీ ఈడీ చందన్ కుమార్ సమంత**





**పెద్దపల్లి/ ఎన్టీపీసీ: సెప్టెంబర్ 17 (వార్తాప్రభ ప్రతినిధి)** యంత్రాలు, సాధనాలను గౌరవించే సాంస్కృతిక పండుగ విశ్వకర్మ జయంతి అని ఎన్టీపీసీ ఈడీ చందన్ కుమార్ సమంత అన్నారు. ఈ మేరకు తెలంగాణ ఎన్టీపీసీలో బుధవారం ఇంజనీర్లు, కార్మికులు, కళాకారుల ఆరాధ్య దైవం అయిన భగవాన్ విశ్వకర్మ పూజను ఘనంగా నిర్వహించారు. సెప్టెంబర్ 17, 2025న జరిగిన ఈ పూజలో, భగవంతుని కృపతో పాటు వారి సాధనాలు, పనికి విజయం, రక్షణ లభించాలని ప్రార్థించారు. ఈ సందర్భంగా ఈడి చందన్ కుమార్ సమంత మాట్లాడుతూ....ఈ పూజ ద్వారా ఎన్టీపీసీ కమ్యూనిటీ ఏకమై, తమ ప్రయత్నాలలో విజయం సాధించేలా భగవంతుని ఆశీర్వాదాలు పొందాలని ఆకాంక్షించారు. కమ్యూనిటీ స్పిరిట్"తో విజయాలు సాధించాలి అని కార్మికులకు, ఉద్యోగులకు సూచనలు చేశారు. భారతదేశ విద్యుత్ రంగానికి అత్యున్నత ప్రమాణం ఎన్టీపీసీ సంస్థ అని ఆనందం వ్యక్తం చేశారు. పూజా కార్యక్రమాల అనంతరం సుమారు 2వేల మంది కార్మికులకు స్వీట్స్ పంపిణీ చేశారు.

# తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా జరపాలి - బీజేపీ



**మండల అధ్యక్షుడు బుర్ర శేఖర్ గౌడ్**

**వేములవాడ, సెప్టెంబర్ 17: (వార్తాప్రభ)** వేములవాడ అర్బన్ మండల భారతీయ జనతా పార్టీ పక్షాన తెలంగాణ విమోచన దినోత్సవం పురస్కరించుకొని నంది కమాన్ చౌరస్తాలో మండల అధ్యక్షుడు బుర్ర శేఖర్ గౌడ్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. తెలంగాణ ప్రజలకు నిజమైన స్వాతంత్రం సెప్టెంబర్ 17 1948 అని రాష్ట్ర ప్రభుత్వాలు అధికారికంగా తెలంగాణ విమోచన దినోత్సవాన్ని జరపాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు ఎర్రం మహేష్, లింగంపల్లి శంకర్, చింతపల్లి వెంకటేశ్వరరావు, చింతపల్లి మోహన్ రావు, జింక అనిల్, ఏ రెడ్డి రాజిరెడ్డి, ప్రధాన కార్యదర్శులు చంద్రగిరి ప్రశాంత్, నర్సింగోజు శంకర్, ఉపాధ్యక్షులు ఎరుగోక్కుల రమేష్, బి రెడ్డి శ్రీనివాస్ రెడ్డి, తిప్పారవేని రాజు, మోర్చా అధ్యక్షులు గంట మహేష్, సంతోష్ యాదవ్, గోనె భాస్కర్, సీనియర్ నాయకులు రేగుల పరుశురాం, గుండెకర్ల లక్ష్మణ్, చల్ల నరసయ్య, అంజన్న యాదవ్, పోచంపల్లి భాను, కార్యదర్శులు కొలనూరి సంజీవరెడ్డి, రెడ్డవేని శ్రీనివాస్, బూర శేఖర్, అధికార ప్రతినిధి కర్రె పవన్, నాయకులు బూత్ అధ్యక్షులు తమ్మిశెట్టి బాలకృష్ణ, రెడ్డవేని రాజు, చొక్కాల ప్రశాంత్ గడ్డి, ప్రశాంత్, లింగంపల్లి సాయికృష్ణ, తుమ్మల సైరనాథ్, వేముల నాగరాజ్, ముద్దంగుల రవి, చింతకుంట నరసయ్య, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

వార్తా ప్రభ

# హైదరాబాద్

## ఘనంగా ప్రజా పాలన వేడుకలు!!

### జాతీయ జెండా ఆవిష్కరించిన సీపీ





**పెద్దపల్లి/ గోదావరిఖని: సెప్టెంబర్ 17 (వార్తాప్రభ ప్రతినిధి)**ప్రజాపాలన దినోత్సవ వేడుకలను రామగుండం పోలీస్ కమిషనరేట్ కార్యాలయములో బుధవారం రోజున ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భముగా రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా మొదట పోలీస్ గౌరవ వందనం స్వీకరించి పోలీస్ కమిషనరేట్ కార్యాలయం భవనం వద్ద జాతీయ జెండాను ఎగురవేశారు. జాతీయ గీతం రాష్ట్ర గీతం ఆయన జయ జయహే తెలంగాణ పాటను ఆలపంచారు. అనంతరం అధికారులకు, సిబ్బందికి పోలీస్ కమిషనర్ ప్రజాపాలన దినోత్సవ వేడుకల శుభాకాంక్షలు తెలియజేసారు.

## ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి ను సత్కరించిన బస్తీ వాసులు

*డ్రైనేజ్ సమస్యపై తక్షణమే స్పందించి 13 లక్షల ప్రత్యేక నిధులతో బస్తీ వాసుల సమస్య పరిష్కరించిన హనుమంత్ రెడ్డి*



**కుత్బుల్లాపూర్ సెప్టెంబర్ 17 (వార్తాప్రభ)** : కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 130 డివిజన్ అపురూప కాలనీ మెయిన్ రోడ్ పరిధిలో డ్రైనేజీ పూర్తిగా పాడువటంతో బస్తి వాసులు తీవ్ర ఇబ్బంది అవుతుండడంతో బస్తి వాసులు నియోజకవర్గ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి ని గత నెల సంప్రదించి విన్నవించారు. ఈ సందర్భంగా ఆయన రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు స్పెషల్ ఫండ్స్ ద్వారా డ్రైనేజీ కొరకు రూ.13,00,000 లక్షల రూపాయలు మంజూరు చేయించి, బుధవారం డివిజన్ అధ్యక్షులు సోమన్న గారి శ్రీధర్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ హరి కిరణ్ పటేల్, కోశాధి కారి భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డ్రైనేజీ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథీగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి పాల్గొని ప్రారంభించారు. అనంతరం కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేస్తూ శాల్వాతో సత్కరించి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు తిప్పారెడ్డి, సెక్రటరీ రమణ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు శ్యామ్, ఆనంద్, సత్తి రెడ్డి, కరణ్, చందు, వీరేశ్ గుప్తా, డివిజన్ జనరల్ సెక్రెటరీ నాగిరెడ్డి, కాలనీ సొసైటీ సభ్యులు గణేషన్, సీతారాం రెడ్డి, అంజిరెడ్డి, ఆకుల కృష్ణ, దయాకర్ రెడ్డి, రాజు చారి, సురేందర్ రెడ్డి, ఇన్నయ్య రెడ్డి, ఆదినారాయణ, మోహన్ రావు, రామకృష్ణ, కాంగ్రెస్ పార్టీ మైనార్టీ అధ్యక్షులు యాసిన్ గఫార్, మహిళ అధ్యక్షురాలు తులసి, శైలజ, నాగ శిరోమణి, ప్రసన్న,యూత్ నాయకులు శ్యామ్, జానీ, హరి, వాసు, తదితరులు పాల్గొన్నారు.

## గుండె గణేష్ ముదిరాజ్ నేతృత్వంలో భారీగా తరలి వెళ్ళిన బిజెపి శ్రేణులు



**శేరిలింగంపల్లి,సెప్టెంబర్ 17 (వార్తాప్రభ):**మియాపూర్ డివిజన్ లో తెలంగాణ రాష్ట్ర విమోచన దినోత్సవం సందర్భంగా డివిజన్ లో ఆర్ బి ఆర్ అపార్ట్మెంట్ దగ్గర జాతీయ జెండా ఆవిష్కరణ చేయడం అలాగే భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ 75 సంవత్సరాల జన్మదిన కార్యక్రమా న్ని కేక్ కట్ చేసి శుభాకాంక్షలు అదేవిధంగా విమోచన దినాన్ని పురస్కరించుకొని మియాపూర్ డివిజన్ నుండి సికింద్రాబాద్ ఫేరేడ్ గ్రౌండ్ కు భారీగా జనాలను తీసుకెళ్లడం జరిగింది,బస్ కన్వీనర్ గుండె గణేష్ ముదిరాజ్.ఈ కార్యక్రమంలో సేవా పక్షం కన్వీనర్ మియాపూర్ డివిజన్ నల్లూరి పట్టాభిరామ్ కో కన్వీనర్ లు చందు మన్యం ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమంలో ఓబీసీ జిల్లా రాజ్య మల్ల నాగేశ్వర్ గౌడ్ రాఘవేంద్రరావు జిల్లా సెక్రెటరీ మాణిక్యరావు సీనియర్ నాయకుడు విజేందర్ సింగ్ పి నాగులు రత్నకుమార్ ప్రభాకర్ రవీందర్ నాయక్ డివిజన్ ప్రధాన కార్యదర్శులు జె.శ్రీనివాస్ కె.ప్రసాద్ బీజేవైఎం ఎస్ టీ ఎస్ సీ మహిళ ఓబీసీ మోర్చాలకు సంబంధించిన అధ్యక్షులు ప్రధాన కార్యదర్శులు బూత్ అధ్యక్షులు సీనియర్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# ఎడిటోరియల్

## మంత్రివర్గంలో ఆ ఫైర్ బ్రాండ్ ఉండాల్సిందేనా ?

: ఏపీలో కూటమి ప్రభుత్వం పదిహేను నెలల పాలన పూర్తి అయింది. ప్రభుత్వం గురించి చంద్రబాబు ముఖ్యమంత్రి హోదాలో అనేక వేదికల మీద చెబుతూనే ఉన్నారు. అయితే ఆయనతో పాటుగా గట్టిగా ప్రచారం చేయాల్సిన తీరులో మంత్రులు చేయడం లేదని అసంతృప్తి అయితే ఉంది. దానికి తోడు వైసీపీ చేస్తున్న ప్రచారం కానీ విమర్శలు కానీ తిప్పికొట్టే విధంగా లేదని ఒక భావన అయితే ప్రభుత్వ పెద్దలలో ఉందట. మాటకు మాట కాదు, ఒక ఫైర్ లా అవతల వారి మీద కౌంటర్లు వేస్తే ఆ కిక్కే వేరబ్బా అన్నట్లుగా ఉండాల్సి ఉంది కానీ అదే కూటమిలో తగ్గింది అని అంటున్నారు. కూటమి ప్రభుత్వంలో ఫైర్ బ్రాండ్లు అంటూ ఎవరూ పెద్దగా కనిపించడం లేదు. ఇష్యూల మీద మాట్లాడే వారు ఉన్నారు. అలాగే విపక్షాలు విమర్శలు చేస్తే కొంతవరకూ ధీటుగా బదులిచ్చే వారూ ఉన్నారు. కానీ జనాల్లోకి బలంగా తాము చెప్పేది నాటుకునేలా చేసే నిప్పు రవ్వలు కావాలని అంటున్నారు. ఇక కూటమి 2024 ఎన్నికల్లో కొత్త ముఖాలకు ఎక్కువగా చాన్స్ ఇవ్వాలని భావించి వారినే తీసుకుంది. దానితో సీనియర్లకు చోటు దక్కలేదు. అయితే ఇపుడు ఆ లోటు ఏమిటో తెలుస్తోంది అని అంటున్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాకు చెందిన చింతకాయల అయ్యన్నపాత్రుడు సీనియర్ నేత, ఎన్టీఆర్ చంద్రబాబుల వద్ద ఆయన అనేక దఫాలుగా మంత్రిగా పనిచేశారు. దాదాపుగా కీలకమైన శాఖలు అన్నీ చూసేశారు. 2024లో తాను చివరి సారిగా పోటీ చేస్తున్నట్లుగా ఆయన ప్రకటించారు. ఈ టెర్మ్ లో మంత్రిగా ఉంటూ తన వారసుడిని తయారు చేయాలని కూడా అనుకున్నారు. కానీ ఆయనకు స్పీకర్ పదవి దక్కింది. దాంతో ఆయన తన నోరు కట్టేసారు అని మొదట్లో బాధపడేవారు. అయితే ఇటీవల ఆయనలో మార్పు వచ్చింది. ఇపుడు వివిధ వేదికల మీద గట్టిగానే మాట్లాడుతున్నారు. స్పీకర్ గా రాజ్యాంగ బద్ధమైన పదవిలో ఉంటూనే జగన్ ని వైసీపీని గట్టిగా విమర్శిస్తున్నారు. ఆయన చేస్తున్న విమర్శలు జనాల్లో కూడా చర్చగా మారుతున్నాయి. సోషల్ మీడియాలో సైతం వైరల్ అవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆయన ఒక్కసారిగా గొంతు పెంచడానికి కారణం ఏమిటి అన్న చర్చ అయితే వస్తోంది. చంద్రబాబుకు అత్యంత సన్నిహితుడు అయిన అయ్యన్నకు మంత్రి పదవి ఖాయమని అంటున్నారు. మంత్రివర్గంలో మార్పు చేర్పులు కచ్చితంగా ఉంటాయని అవి ఎపుడు అన్నది తెలియకపోయినా జరిగితే మాత్రం అయ్యన్నకు మంత్రి పదవి ఖాయమని చర్చ అయితే బలంగా ఉంది. అయ్యన్న లాంటి వారు కొందరు ఉంటే బాగా కాసుకుంటారు అన్నది కూడా ప్రభుత్వ పెద్దలలో ఉంది అని అంటున్నారు. జనాలలో చర్చ రావడానికి అయినా ప్రభుత్వం చేసేది ఏమిటో తెలియాలి అనుకున్నా సీనియర్లను ఫైర్ బ్రాండ్లను తీసుకోవడమే బెటర్ అని అంటున్నారుఅయ్యన్న లాంటి వారు చేసే కామెంట్స్ చాలా కఠినంగా ఉంటాయి. కొన్ని సార్లు ప్రత్యర్థులు సైతం నొచ్చుకునేలా కటువుగా ఉంటాయి. అయితే అలాంటివి ఈ నేపథ్యంలో అవసరం అన్న భావన ఉందట. ఎందుకంటే ప్రభుత్వం చేసేది చెప్పుకోవడం ఒక ఎత్తు అయితే దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని అంటున్నారు. అలా చేయకపోతే జనాలు వాటినే నమ్మే ప్రమాదం ఉందని అంటున్నారు. మొత్తానికి చూస్తే అయ్యన్న లాంటి వారు ఉండాలి అని పార్టీలో కార్యకర్తల స్థాయి నుంచే ఒక రకమైన భావనగా ముందుకు వస్తోందట. అధినాయకత్వం కూడా దీని మీద సీరియస్ గా ఆలోచిస్తోంది అని అంటున్నారు. దాంతో అయ్యన్న రాజకీయ పదవీ విరమణ అన్నది మంత్రి పదవితోనే తప్ప స్పీకర్ గా కానే కాదు అని అంటున్నారు. చూడాలి మరి ఏమి జరుగుతుందో.

## విశ్వకర్మ జయంతి సందర్భంగా ఘన నివాళులు



**విజయవాడ పశ్చిమ సెప్టెంబర్ 17 :(వార్తా ప్రభ ప్రతినిధి)** విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్ యం ఆదేశాల మేరకు ప్రధాన కార్యాలయంలో గల కమాండ్ కంట్రోల్ రూమ్ నందు విశ్వకర్మ జయంతి వేడుకలను వి యం సి సిబ్బంది తో అకౌంట్స్ ఆఫీసర్ బి.సత్యనారాయణమూర్తి, మేనేజర్ ప్రభావతి ఘనంగా నిర్వహించారు .ముందుగా విశ్వకర్మ గారి పటానికి పూలమాల అర్పించారు, ఈ సందర్భంగా అకౌంట్స్ ఆఫీసర్ బి సత్యనారాయణమూర్తి, మేనేజర్ ప్రభావతి మాట్లాడుతూ విశ్వకర్మ బ్రహ్మ దేవుని కుమారునిగా పురాణాలు చెబుతున్నాయి. విశ్వకర్మ సకల కళలకు ఆదిదేవుడు, అధిపతని, దేవలోకాలను నిర్మించిన భవన శిల్పి, వాస్తు శిల్పి, స్థపతని (ఆర్కిటెక్చర్). దేవతలకు ఆకాశాన విహరించే పుష్పక విమానాలు, ఆయుధాలు, వివిధ రకాల సువర్ణాభరణాలు మరియు పనిముట్లను సృష్టించి ఇచ్చిన రూప శిల్పిని, విశ్వకర్మ భగవానుడు సమస్త హస్తకళలన్నింటికి ఆది దేవుడు మరియు విశ్వము ప్రధాన రూపశిల్పి అని, విశ్వకర్మ ప్రపంచానికి దైవ యాంత్రికుడు (ఇంజనీరు) అని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిఎంసి సూపరిండెంట్లు, సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## అధికారులు బాధ్యతతో పనిచేయాలి

### ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి



**కనిగిరి సెప్టెంబర్ 17 వార్తా ప్రభ ప్రతినిధి** కనిగిరి నియోజకవర్గం కనిగిరిలోని ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు నరసింహారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర మాట్లాడుతూ అధికారులు బాధ్యతతో పనిచేసి ప్రజల సమస్యలు పరిష్కరించాలని సూచించారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ప్రజా ప్రతినిధులు ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. శాఖల వారీగా సమీక్ష నిర్వహించి భవిష్యత్తు అభివృద్ధి కార్యక్రమాలపై కార్యచరణ రూపొందించాలని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ దంతులూరి ప్రకాశం, జడ్పిటిసి కస్తూరి రెడ్డి, ఎంపీటీసీలు,వివిధ గ్రామాల సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

# పశ్చిమ వైకాపా కార్యాలయంలో విరాట్ విశ్వకర్మ జయంతి వేడుకలు

- విరాట్ విశ్వకర్మ భగవాన్ కి ప్రత్యేక పూజలు చేసిన వైసిపి నాయకులు
- హిందూ పురాణాల ప్రకారం విశ్వకర్మ అంటే విశ్వాన్ని సృష్టించినవారు
- విశ్వకర్మ జయంతిని అధికారికంగా నిర్వహించిన మొట్టమొదటి ప్రభుత్వం జగనన్న ప్రభుత్వం
- ఇది మా గొప్పే వైసీపీ నాయకులు





**విజయవాడ పశ్చిమ సెప్టెంబర్ 17 :(వార్తా ప్రభ ప్రతినిధి)** విరాట్ విశ్వకర్మ భగవాన్ జయంతి సందర్భంగా ఎన్టీఆర్ జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి కామరాజ్ హరీష్ కుమార్ ఆధ్వర్యంలో జయంతి వేడుకలు స్థానిక బ్రాహ్మణ వీధిలో గల వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పశ్చిమ నియోజకవర్గ కార్యాలయంలో ఘనంగా జరిగాయి. వైసిపి నాయకులు విశ్వకర్మ భగవాన్ కి పూలమాలలు అర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వైసీపీ నాయకులు మాట్లాడుతూ విశ్వానికి సృష్టికర్తగా,ప్రజాపతిగా విరాట్ విశ్వకర్మ భగవాన్ పరిగణిస్తారన్నారు. హిందూ పురాణాల ప్రకారం విశ్వకర్మ విశ్వాన్ని సృష్టించినవాడన్నారు. దేవతల భవనాలు,రథాలు మరియు ఇంద్రుని వజ్రం వంటి ఆయుధాలను ఆయన రూపొందించారన్నారు. ఋగ్వేదంలో సృష్టి కర్తగా,కృష్ణ యజుర్వేదంలో ప్రజాపతిగా అధర్వణ వేదంలో ఆహార ప్రదాతగా పేర్కొనబడ్డరన్నారు. ఇది దైవిక వాస్తుశిల్పి విశ్వకర్మకు అంకితం చేయబడిన పండుగ. చేతివృత్తులవారు తమ పనిముట్లను,యంత్రాలను పూజించి,వృత్తిలో ఉన్నత స్థానాన్ని పొందాలని కోరుకుంటారన్నారు. ఆయనను సగుణ బ్రహ్మం,జగద్రక్షకుడు అని కూడా పిలుస్తారన్నారు. విశ్వకర్మ జయంతిని అధికారికంగా నిర్వహించిన మొట్టమొదటి ప్రభుత్వం జగనన్న ప్రభుత్వం అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వైయస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎన్టీఆర్ జిల్లా ఆర్టిసన్ సెల్ అధ్యక్షులు కేదారి ప్రసాద్, పశ్చిమ ఆర్టిసన్ సెల్ అధ్యక్షురాలు అండలూరి లత, వైసిపి విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు సున్నపు వీరభద్రచారి, భ్రమరాంబ, రత్నమాచారి తదితరులు పాల్గొన్నారు

# విజయవాడ పశ్చిమ ఎమ్మెల్యే కార్యాలయంలో ఘనంగా ప్రధాని మోదీ జన్మదిన వేడుకలు





**విజయవాడ పశ్చిమ సెప్టెంబర్ 17 :(వార్తా ప్రభ ప్రతినిధి)** భారత ప్రధాని నరేంద్ర మోదీ 75 వ జన్మదిన వేడుకలను భవాని పురం ఎన్డీఏ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. భారత యువజన వ్యవహారాలు మరియు క్రీడా మంత్రిత్వ శాఖ మై భారత్,మేరా యువ భారత్ ఎన్టీఆర్ జిల్లా ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో పశ్చిమ ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్ , దుర్గమ్మ గుడి మాజీ చైర్మన్ పైలా సోమినాయుడు, మై భారత్ ఎన్టీఆర్ జిల్లా డిస్ట్రిక్ట్ యూత్ ఆఫీసర్ సుంకర రాము, యూత్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ మేనేజర్ సుబ్బారావు, జనసేన 42 వ డివిజన్ అధ్యక్షురాలు తిరుపతి అనూష తదితరులు పాల్గొని కేక్ కట్ చేశారు. ముందుగా వికాస్ దివాస్ కార్యక్రమంలో లో భాగంగా ఎన్డీఏ కార్యాలయం ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం ప్రధాని మోదీ ఎట్ 20 ఏళ్ల రాజకీయ జీవితానికి సంబంధించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు .ఈ సందర్భంగా డిస్ట్రిక్ట్ యూత్ ఆఫీసర్ సుంకర రాము మాట్లాడుతూ ప్రపంచ దేశాలన్నింటిలో భారత్ ను అగ్రస్థానంలో నిలబెట్టడానికి ప్రధాని మోడీ ప్రయత్నం చేస్తున్నారన్నారు. అన్ని రంగాల్లో యువత ముందడుగు వేయాలని వికాస్ దివాస్ కార్యక్రమాన్ని 766 జిల్లాల్లో ప్రతిష్టాత్మకంగా ప్రారంభించారని తెలిపారు. మన్ కి బాత్, సభ్యత ఈ సేవ, యంగ్ రైటర్స్, యూత్ పార్లమెంట్ వంటి ఎన్నో కార్యక్రమాలను ప్రధాని మోడీ రూపొందించి అమలు చేస్తున్నారని అన్నారు. 2047 నాటికి ప్రపంచ దేశాలన్నింటిలో భారత్ ను అగ్రస్థానంలో నిలబెట్టడానికి ప్రధాని మోడీ కృషి చేస్తున్నారని తెలిపారు. దుర్గమ్మ గుడి మాజీ చైర్మన్ పైలా సోమినాయుడు మాట్లాడుతూ 13 ఏళ్లు గుజరాత్ సీఎం గాను 11 ఏళ్లుగా ప్రధాన మంత్రి గా కొనసాగుతున్న మోడీ ఆయురారోగ్యాలతో ఉండాలని దేశ సేవలో మరింత చురుగ్గా పాల్గొనాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎన్డీఏ కూటమి నేతలు బొల్లేపల్లి కోటేశ్వరరావు,దుర్బేశుల హుస్సేన్, కరిముల్లా, లింగం శివప్రసాద్, విశ్వంశెట్టి శ్రీనివాసరావు,పెటేటి నాంచారయ్య, పగడాల కృష్ణ, బెన్నా భక్తుల సోమేశ్వరరావు, గోళ్ళ విశ్వేశ్వరరావు, ఏలూరి సాయి శరత్, పోతిన అవినాష్, కురాకుల సురేష్, తమ్మిన లీలా కరుణాకర్, మధు మస్తాన్, పులిచేరి రమేష్, దుర్బేసుల మీరా వలి ఆకారపు విజయ కుమారి, షర్మిల, మంగళపురి మహేష్ ,పత్సవ మల్లికార్జున, సుజనా మిత్రా కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

# డంపింగ్ యార్డు రహిత రాష్ట్ర సాధనే లక్ష్యం

- అమృత్-2.0 పనులకు త్వరలో టెండర్లు పిలుస్తాం - ప్రతి ఇంటికీ కుళాయిల ద్వారా స్వచ్ఛమైన నీటిని ఇస్తాం - ఖజానా ఖాళీ అయినా గౌరవ సీఎం అపార అనుభవంతో అభివృద్ధి వైపు పరుగులు - ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పట్టణ ప్రాంతాల్లో పనులు చేపడుతున్నాం - ముఖ్యమంత్రి స్వచ్ఛతకు అత్యంత ప్రాధాన్యమిస్తున్నారు - పూర్తిస్థాయిలో స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛభారత్ సాకారంలో ప్రజలు భాగస్వామ్యంకావాలి
- స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో మునిసిపల్, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ








**విజయవాడ పశ్చిమ సెప్టెంబర్ 17 :(వార్తా ప్రభ ప్రతినిధి)** ఆంధ్రప్రదేశ్‌ను డంపింగ్ యార్డు రహితంగా మార్చేందుకు వినూత్న విధానాలను అనుసరిస్తున్నామని.. పూర్తిస్థాయిలో స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛ భారత్ సాకారంలో ప్రజలు భాగస్వాములు కావాలని రాష్ట్ర మునిసిపల్, పట్టణాభివృద్ధి శాఖ మంత్రివర్యులు పి.నారాయణ పిలుపునిచ్చారు. మంత్రివర్యులు పి.నారాయణ బుధవారం విజయవాడ కేపీ నగర్‌లో జరిగిన స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో పాల్గొన్నారు. స్వయంగా పార్కు వద్ద రహదారులను శుభ్రంచేసే కార్యక్రమంలో భాగస్వాములయ్యారు. స్వచ్ఛతా హీ సేవా బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2 వరకు స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలు పండగలా జరుగుతాయని.. స్వచ్ఛ ఉత్సవం ఇతివృత్తంతో క్లీన్, గ్రీన్, వేస్ట్ మేనేజ్‌మెంట్ లక్ష్యాలుగా వినూత్న కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. బహిరంగ ప్రదేశాలను, పబ్లిక్ ప్రాంతాలను శుభ్రంగా ఉంచడం, అదేవిధంగా పారిశుద్ధ్య కార్మికుల క్షేమం, సంక్షేమానికి కృషిచేయడం వంటివి చేయడం జరుగుతుందన్నారు. ప్లాస్టిక్ రహిత జీవనశైలిని ప్రోత్సహించడంలో భాగంగా తొలి అడుగుగా మునిసిపల్ శాఖ ఆధ్వర్యంలో సచివాలయం, విభాగాధిపతుల కార్యాలయాల్లో ప్లాస్టిక్ బాటిళ్లకు ప్రత్యామ్నాయ బాటిళ్లు ఉపయోగిస్తున్నట్లు తెలిపారు. అక్టోబర్ 2వ తేదీ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్ కార్యాలయాలు, శాఖల కార్యాలయాల్లోనూ ఇదేవిధమైన చర్యలు తీసుకొని.. దశల వారీగా ప్రజలను కూడా ఈ మంచి ప్రయత్నానికి చేరువచేసేందుకు కృషిచేస్తున్నట్లు తెలిపారు. ప్రతినెలా మూడో శనివారం స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలను వివిధ ఇతివృత్తాలతో నిర్వహించడం జరుగుతోందని.. గౌరవ ముఖ్యమంత్రి సైతం ఈ కార్యక్రమాల్లో పాల్గొని ప్రజలను స్వచ్ఛతపై చైతన్యవంతులను చేస్తున్నారన్నారు.

**అమృత్-2.0 పనులకు త్వరలో టెండర్లు పిలుస్తాం:** నిర్లక్ష్యానికి గురైన అమృత్ కార్యక్రమానికి జీవం పోస్తూ త్వరలోనే పనులకు టెండర్లు పిలుస్తామని మంత్రి నారాయణ తెలిపారు. వచ్చే రెండేళ్లలో ప్రతి ఇంటికీ కుళాయిల ద్వారా స్వచ్ఛమైన తాగునీటిని అందించనున్నట్లు పేర్కొన్నారు. గత ప్రభుత్వం రూ. 10 లక్షల కోట్లు అప్పులు చేసి వెళ్లిందని.. అయినా గౌరవ ముఖ్యమంత్రి అపార అనుభవంతో అభివృద్ధి దిశగా అడుగులు వేస్తున్నామని.. ఒకవైపు అప్పులు తీరుస్తూనే మరోవైపు ప్రజలకిచ్చిన హామీల మేరకు సూపర్ 6 పథకాలను అమలుచేస్తున్నట్లు వివరించారు. గత ప్రభుత్వం ప్రజలపై చెత్త పన్ను వేసి 85 లక్షల టన్నుల చెత్తను వదిలివెళ్లిందని.. ఈ చెత్తను ఏడాదిలోగా తొలగించాలని గత అక్టోబర్ 2న గౌరవ ముఖ్యమంత్రి సూచించారని.. ఇప్పటివరకు 83 లక్షల టన్నుల చెత్తను పూర్తిగా తొలగించామన్నారు. మరో అయిదు రోజుల్లో మిగిలిన చెత్తనూ తొలగిస్తామన్నారు. ఇందుకు కృషిచేసిన స్వచ్ఛ భారత్ కార్పొరేషన్, మునిసిపల్ శాఖ ఇంజనీర్లు, కమిషనర్లు ఇలా ప్రతిఒక్కరికీ అభినందనలు తెలియజేస్తున్నట్లు పేర్కొన్నారు. జపాన్, సింగపూర్ తదితర దేశాల్లోని రహదారులపై చెత్త మచ్చుకైనా కనిపించదని... ఇదేవిధమైన స్వచ్ఛత దిశగా సమష్టిగా ముందుకు కదలాలన్నారు. స్వచ్ఛమైన తాగునీరు, ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణ, చక్కని రహదారులు, వాన నీరు నిలవని పరిస్థితులు వంటివి పట్టణ ప్రాంతాల ప్రజలుకోరుకుంటారని.. ఇందుకు అనుగుణంగా ప్రభుత్వం వీటికి ప్రాధాన్యమిస్తున్నట్లు పేర్కొన్నారు. త్వరలో కొత్తగా ఆరు వేస్ట్ టు ఎనర్జీ ప్లాంటులు ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి నారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కె. పట్టాభిరామ్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్మెంట్ ప్రిన్సిపల్ సెక్రెటరీ ఎస్. సురేష్ కుమార్, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి లక్ష్మిశ, స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఎండి బి. అనిల్ కుమార్ రెడ్డి, విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్ యం, మెప్మా ఎండి తేజ్ భరత్, 10 వ డివిజన్ కార్పొరేటర్ దేవినేని అపర్ణ, విఎంసి అధికారులు పాల్గొన్నారు.

# ఇతర కులస్తులకు బలిజ కులం పేరు పెట్టొద్దు

### ప్రభుత్వానికి కాపు సామాజిక వర్గ రాష్ట్ర నాయకులు ఆకుల శ్రీనివాస్ కుమార్ వినతి



**విజయవాడ పశ్చిమ, సెప్టెంబర్ 17: (వార్తా ప్రభ ప్రతినిధి)** బలిజ కులంకానీ ఇతర కులస్తులకు బలిజ అన్న పేరును తగిలించవద్దని రాష్ట్ర ప్రభుత్వానికి కాపు సామాజిక వర్గ రాష్ట్ర నాయకులు ఆకుల శ్రీనివాస్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ఇటీవల ప్రభుత్వం దొమ్మర కులానికి గిరి బలిజ అనే పేరును అధికారికంగా మార్చడం సరైనది కాదని ఆయన పేర్కొన్నారు . ఇతర కులాల కు సంబంధించిన వారిని ఆయా కులాల్లోనే కొనసాగించడం సముచితమని పేర్కొన్నారు. అంతేగాని ప్రతి ఒక్క కులాన్ని తీసుకొచ్చి కాపు, తెలగ, బలిజ, ఒంటరి, తూర్పు కాపు, మున్నూరు కాపు కులాల పేర్లను కలుపుతూ ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చే వైఖరిని విడనాడాలని ఆకుల శ్రీనివాస్ కోరారు. ఈ తరహా చర్యలు కాపు సామాజిక వర్గ ప్రజల మనోభావాలను దెబ్బతిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

# విజయవాడలో దసరా ఏర్పాట్లపై మంత్రివర్గ సమీక్షకు సన్నాహాలు





**విజయవాడ పశ్చిమ సెప్టెంబర్ 17 :(వార్తా ప్రభ ప్రతినిధి)** దేవదాయ శాఖ కమిషనర్ కె. రామచంద్ర మోహన్, దుర్గగుడి ఈవో వి.కె. శీనా నాయక్‌తో కలిసి దసరా ఉత్సవాల ఆహ్వానం పత్రికని దేవాదాయ శాఖ మంత్రివర్యులు ఆనం రామనారాయణ రెడ్డి కి సమర్పించారు. ఈ సందర్భంగా వారు ప్రస్తుతం కొనసాగుతున్న ఏర్పాట్ల పురోగతిని వివరించారు.

**ఏర్పాట్ల సమీక్ష:** ఇంద్రకీలాద్రిపై దసరా ఉత్సవాల కోసం జరుగుతున్న ఏర్పాట్ల పురోగతిని వారు మంత్రికి ప్రిన్సిపల్ సెక్రటరీ ఎండోమెంట్ హరి జవహర్ లాల్ సినియర్ ఐ. ఏ. యస్ సమక్షములో అన్ని విషయాలు వివరించారు. 22వ తేదీ నుంచి ప్రారంభం కానున్న ఉత్సవాలకు సంబంధించి భక్తుల వసతులు, భద్రత, రవాణా వంటి విషయాలపై జరుగుతున్న పనులను తెలిపారు. మంత్రుల బృందం సమీక్షకు ముందే అన్ని ఏర్పాట్లను పూర్తి చేయడానికి దేవస్థానం అధికారులు వేగంగా పనిచేస్తున్నారని వివరించారు. ఈ సమీక్ష తర్వాత దసరా ఉత్సవాల నిర్వహణకు. సంబంధించిన తుది నిర్ణయాలు తీసుకుంటారు.

## ప్రధాని నరేంద్ర మోడీ పుట్టినరోజు సందర్భంగా షేక్ రాజాసాహెబ్ ఆసుపత్రిలో ప్రజారోగ్య కార్యక్రమాలు





**విజయవాడ పశ్చిమ సెప్టెంబర్ 17 :(వార్తా ప్రభ ప్రతినిధి)** భారత ప్రధాని నరేంద్ర మోడీ పుట్టినరోజు సందర్భంగా బుధవారం ఉదయం స్వస్థనారి సా సెట్ పరివార్ అభియాన్ జాతీయ ప్రోగ్రాం నిర్వహించారు. షేక్ రాజా హాస్పిటల్ కొత్తపేటలో జరిగిన ఈ కార్యక్రమంలో మహిళలు వారి ఆరోగ్యం గురించి శ్రద్ధ తీసుకోవడం కోసం కొన్ని అసంక్రమిత వ్యాధులు ముందుగా తెలుసుకొనుట కొరకు ఈ ప్రోగ్రాం లో అవగాహన కల్పించారు. దీనిలో భాగంగా గర్భిణీ స్త్రీలకు పరీక్షలు రక్తహీనత నివారణ రక్తపోటు మధుమేహం నోటి క్యాన్సర్ రొమ్ము క్యాన్సర్ గర్భాశయ క్యాన్సర్స్క్రీనింగ్, టీవీ వ్యాధి పట్ల ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ ప్రోగ్రాం షేక్ రాజా హాస్పిటల్లో సెప్టెంబరు 17 నుంచి అక్టోబరు 2 వరకు జరుగుతుంది. ఈ ప్రోగ్రాం షేక్ రాజా హాస్పిటల్ లో జరుగుతుంది కావున మహిళలు అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగ పరచుకోవాల్సిందిగా ప్రజలకు అవగాహన కల్పించామని వైద్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో 51 వ డివిజన్ కార్పొరేటర్ మరుపిల్ల రాజేష్ , 53వ డివిజన్ మహాదేవు అప్పాజీ రావు, 44వ డివిజన్ తెలుగుదేశం నాయకులు మైలవరపు దుర్గారావు , షేక్ రాజా సాహెబ్ ఇంచార్జి సూపరింటెండెంట్, గైనకాలజిస్ట్ డాక్టర్ స్రవంతి డాక్టర్ సాయిరామ్, జనరల్ ఫిజిషియన్ డాక్టర్ గౌస్ భాషా, హెల్త్ సూపర్వైజర్ లలిత కుమారి, పాల్గొనగా ఎన్టీఆర్ జిల్లా డి సి హెచ్ ఎస్ డాక్టర్ మాధవి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఇదిలావుండగాఈ ప్రోగ్రాము సెప్టెంబరు 22, 26వ తేదీల్లో షేక్ రాజా హాస్పిటల్ లో మెగా హెల్త్ క్యాంపు నిర్వహించడం జరుగుతుంది ఈ మెగా హెల్త్ క్యాంపు ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎన్టీఆర్ జిల్లా డి సి హెచ్ డాక్టర్ మాధవి పిలుపునిచ్చారు.

## మహిళల ఆరోగ్యం విషయంలో శ్రద్ధ చూపాలి



**ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 17 (వార్తా ప్రభ ప్రతినిధి):** మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం సంతోషంగా ఉంటుందని కొండపల్లి మున్సిపల్ చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు అన్నారు. కొండపల్లి పట్టణ ఆరోగ్య కేంద్రం (శ్రామిక నగర్), ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (ఖిల్లా రోడ్డు)లో బుధవారం స్వస్థ్ నారీ, స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ మహిళలకు అన్ని రకాల వైద్య పరీక్షలు చేయాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం రూపొందించిందని, ప్రధాని నరేంద్ర మోడీ పుట్టినరోజు సందర్భంగా ప్రారంభించారని తెలిపారు. ఈ కార్యక్రమం వచ్చినాల రెండో తేదీ వరకు కొనసాగుతుందన్నారు. ఇందులో భాగంగా గ్రామస్థాయి నుంచి నగరాల వరకు అన్ని చోట్ల వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి మహిళలకు వైద్య పరీక్షలు చేస్తారని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు అఫ్సర్, జనార్ధన్ స్వామి దాసు, డాక్టర్ బి.విజయకుమార్, డాక్టర్ ఎం.వంశీలాల్ రాథోడ్, సాంబశివరావు, రత్నకుమారి, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, హాస్పటల్ సిబ్బంది పాల్గొన్నారు.

# కాలనీల కోసం ఎదురుచూపులు

### కలలుగానే మిగిలిపోతున్న పేదవాడి సోతింటి కల

**జగ్గయ్యపేట సెప్టెంబర్ 17 (వార్తప్రభ)** నియోజకవర్గంలోని పేద మధ్యతరగతి కుటుంబాల సొంతింటి కల కలలుగానే మిగిలిపోతున్నాయని. ప్రస్తుత ప్రభుత్వంలో కాలనీల కోసం ఎదురుచూసి కళ్ళు కాయలు కాసి పోతున్నాయని ప్రజలు చర్చించుకుంటున్నారు. ప్రస్తుత ప్రభుత్వంలో నియోజకవర్గంలో ఇంతవరకు ఒక కాలనీ ఇల్లు కూడా మంజూరయ్యి నిర్మాణానికి నోచుకోలేదని తెలుస్తుంది. జియో ట్యాగింగ్ పేరుతో ఎక్కడి నిర్మాణాలు అక్కడే ఆగిపోయాయని. సొంత స్థలం ఉండి బేస్మెంట్ వరకు నిర్మాణం చేసిన స్థలాల్లో పిచ్చి మొక్కలు పెరిగి విషపు పురుగులకు ఆవాసాలుగా ఏర్పడుతున్నాయని ప్రజలు అంటున్నారు. కాలనీలు మంజూరయ్యాయని మెసేజ్లు వచ్చి ఐదు నుండి ఎనిమిది నెలల వరకు గడుస్తున్నాయని. నిర్మాణాలు చేసుకోవాలో ఆగిపోవాలో అర్థం కాక, అధికారుల నుండి ఎటువంటి సమాచారం లేక పరిస్థితి అగమ్య గోచరంగా ఉందని లబ్ధిదారులు వాపోతున్నారు. జగ్గయ్యపేట పట్టణ పరిధిలో సుమారు 150 గృహాలు మంజూరైనట్లు, జగ్గయ్యపేట మండల పరిధిలో సుమారుగా 700 అప్లికేషన్లు, వత్సవాయి పెనుగంచిప్రోలు మండలాల్లో అదే స్థాయిలో అప్లికేషన్లు వచ్చినట్లు తెలుస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటనలలో శ్రావణమాసం, దసరా, కార్తీక మాసలలో లక్షల్లో గృహప్రవేశాలు అని ప్రకటనలు చేస్తున్నప్పటికీ. నియోజకవర్గంలోని ప్రజలు కాలనీల కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడింది . దీనిపై అధికారులు ఎలా స్పందిస్తారో వేచి చూడాల్సి ఉంది.



## బాలికపై అత్యాచారానికి పాల్పడిన యువకుడు

### యువకుడిపై పోక్సో కేసు నమోదు

**మైలవరం సెప్టెంబర్ 17 (వార్తప్రభ):** బాలికపై అత్యాచారానికి పాల్పడిన యువకుడిపై పోలీసులు ఫోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. స్థానిక ఎస్ఐ సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం ఎన్టీఆర్ జిల్లా మైలవరం మండల పరిధిలోని పోరాటనగర్ లో 17 ఏళ్ల బాలిక వెంట అదే గ్రామానికి చెందిన అజ్మీర రమేష్ నాయక్(24) గత నెల రోజులుగా వెంటపడుతున్నాడు. ఇంటిలో బాలిక ఒంటరిగా ఉండటం చూసి అజ్మీర రమేష్ నాయక్ అత్యాచారం చేశాడు. దీంతో ఆ బాలిక తల్లిఈ నెల అనగా 15 సెప్టెంబర్ 2025 వ తేదీన మైలవరం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా బాలికపై అత్యాచారానికి పాల్పడిన అజ్మీర రమేష్ నాయక్ పై పోక్సో చట్టం కింద పోలీసులుకేసు నమోదు చేశారు. ఈ నెల 17వ తేదీ బుధవారం నిందితుడు అజ్మీర రమేష్ నాయక్ ను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ తెలియజేశారు. మైలవరం ఏసీపి వై.ప్రసాద రావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## పేకాట శిబిరంపై పోలీసులు దాడి

*నలుగురు పేకాట రాయుళ్లు అరెస్ట్.*

*రూ. 16,500 ల నగదు స్వాధీనం చేసుకున్న పోలీసులు*

**మైలవరం సెప్టెంబర్ 17 (వార్తప్రభ):** మైలవరం మండల పరిధిలోని చంద్రగూడెం గ్రామ పరిధిలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై పోలీసులు బుధవారం దాడి చేశారు. ఈ దాడిలో నలుగురు పేకాటరాయుళ్ల ను అరెస్టు చేసి వారి నుంచి రూ. 16500 ల నగదు స్వాధీన పరుచుకున్నట్లు ఎస్సై సుధాకర్ తెలియజేశారు. అరెస్టు చేసిన వారిని కోర్టులో హాజరు పరచనున్నట్లు తెలిపారు.

## బెజవాడ బార్ అసోసియేషన్ ఆధునీకరణకు 30 లక్షల కేటాయిస్తా

### పార్లమెంటు సభ్యులు కేశినేని శివనాథ్ ప్రకటన






**విజయవాడ, సెప్టెంబర్ 17 :(వార్తా ప్రభ ప్రతినిధి)** విజయవాడ పార్లమెంటు సభ్యులు కేశినేని శివనాద్ (చిన్ని) ది బెజవాడ బార్ అసోసియేషన్ కు బుధవారం విచ్చేశారు. ఈ సందర్భంగా న్యాయవాదులు తమ బార్ అసోసియేషన్ ఆధునీకరణ గురించి మరియు వారికి ఉన్న సమస్యల్ని వివరించారు. వీటికి ఎంపీ సానుకూలంగా స్పందిస్తూ బెజవాడ బార్ అసోసియేషన్ ఆధునికరణ కోసము 30 లక్షల రూపాయలు ఫండ్ ను వారం రోజుల్లోగా రిలీజ్ చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ మన రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న విజయవాడ ఉత్సవ్ కు అందరూ సహకరించాలని కోరుతూ ఈ ప్రోగ్రాంలో భాగంగా బెజవాడ బార్ అసోసియేషన్ ముందుగా విజయవాడ ఉత్సవము ను ప్రోత్సహిస్తూ బైక్ ర్యాలీ చేపట్టిందని దీనిని మేము కూడా స్ఫూర్తిగా తీసుకొని ప్రతి వార్డులో బైక్ ర్యాలీ చేపిస్తూ విజయవాడ ఉత్సవ్ ను ప్రజల్లోకి తీసుకువెళ్లి విజయవంతం చేస్తామన్నారు. అలానే అందరూ విజయవాడ ఉత్సవ్ ను జయప్రదం చేయాలని ఈ ఉత్సవ్ మన విజయవాడ ఖ్యాతిని దశదిశలకు వ్యాపింప చేస్తుందని, ఆర్థికంగా కూడా తోడ్పడుతుందని చిరు వ్యాపారుల నుంచి పెద్దపెద్ద వ్యాపారుల వరకు చేయూతను ఇచ్చినట్లు ఉంటుందని పేర్కొన్నారు. మరియు ఈ విజయవాడ ఉత్సవ్ ను ప్రజల్లోకి తీసుకువెళ్లి చైతన్యపరిచిన బెజవాడ బార్ ప్రెసిడెంట్ ఏకే భాషా గారిని మరియు ఏపీ బార్ కౌన్సిల్ మెంబర్ చలసాని అజయ్ కుమార్ ని అభినందించారు. ఈ సభకి అధ్యక్షత వహించిన ఏకే భాషా మాట్లాడుతూ ముందుగా సహాయం కోరుతూ వెళ్లి అడిగిన వెంటనే లేదు అనకుండా బెజవాడ బార్ అసోసియేషన్ ఆధునీకరణ కోసం 30 లక్షలు ఫండ్ ఇచ్చిన మన ఎంపీ కేశినేని శివనాద్ చిన్ని కి బెజవాడ బార్ అసోసియేషన్ మెంబర్స్ అందరి తరపున ధన్యవాదాలు తెలియజేశారు. అంతేకాకుండా మన విజయవాడని విజయపథంలో నడిపించడం కోసం మన ఎంపీ చేపట్టిన ఈ విజయవాడ ఉత్సవ్ కార్యక్రమానికి న్యాయవాదులందరూ ఎప్పుడూ సహాయ సహకారాలు అందిస్తారన్నారు. ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయటంలో తమ వంతు కృషి ఎప్పుడు చేస్తామని ఎంపీ కి మాట ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏపీ బార్ కౌన్సిల్ మెంబర్ చలసాని అజయ్ కుమార్ మాట్లాడుతూ విజయవాడ మన కలల రాజధాని అని అలాంటి విజయవాడని అభివృద్ధిలోకి తీసుకురావడం కోసం మన రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఈ విజయవాడ ఉత్సవ కార్యక్రమం ఎంతో అద్భుతమైనదని, ఈ విజయవాడ ఉత్సవ్ కార్యక్రమంతో మరుగున పడిపోతున్న లలిత కళలను సైతం మళ్లీ మనం అభివృద్ధి పరిచే ఇంత మంచి కార్యక్రమాన్ని చేపట్టి ముందుకు నడిపిస్తున్న మన ఎంపీ గారు కేశినేని శివనాథ్ చిన్ని ని అభినందించారు. అంతేకాకుండా తమ బార్ కి వచ్చి మా సమస్యలను విని మాకు సహాయం అందించాలనే సదుద్దేశంతో ఆయన ప్రకటించిన 30 లక్షల రూపాయల ఫండ్ కూడా ఎంతో గొప్ప విషయం అనీ కృతజ్ఞతలు తెలియజేశారు. ఏపీ బార్ కౌన్సిల్ మెంబర్ సుంకర రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ బెజవాడ బార్ కు చేస్తున్న ఈ సహాయం మరువలేనిది అని వీటితో పాటే న్యాయవాదులకు ఇచ్చిన హామీలను కూడా నెరవేర్చాలని కోరారు. ఈ సందర్భంగా మాజీ అధ్యక్షులు బెజవాడ బార్ నెంబరు ప్రముఖ సీనియర్ న్యాయవాది వేముల హజరతయ్య గుప్తా మాట్లాడుతూ ఇలాంటి దయ కరుణ కలిగిన మహానుభావులు మనకి ఎంపీగా రావడం మన అదృష్టం అని ఆ విజయవాడలోనే ఉండటం మన అదృష్టం అని తెలుపుతూ మన ఎంపీ కేశినేని శివనాథ్ చిన్ని ని వేదమంత్రాలతో ఆశీర్వదించారు. ఈ కార్యక్రమానికి సీనియర్ జూనియర్ న్యాయవాదులు పాల్గొని కేసునేని శివనాథ్ చిన్ని కి కృతజ్ఞతలు తెలియజేస్తూ ఆయనను సత్కరించుకున్నారు.

## సీఎం సహాయ నిధి నిరుపేదలకు గొప్ప వరం

*లబ్ధిదారులకు చెక్ అందజేసిన శేరి సతీష్ రెడ్డి*

*శేరి సతీష్ రెడ్డి చొరవతో అనారోగ్యంతో ఉన్న మహిళకు ఆర్థిక సహాయం*



**కూకట్ పల్లి, సెప్టెంబర్ 17(వార్తా ప్రభ):** కూకట్పల్లి నియోజకవర్గం, కేపీహెచ్బీ వాస్తవ్యులు నడింపల్లి కనకదుర్గ కి ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి ఆర్థిక సహాయం అందింది. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న కనకదుర్గ కు వైద్య ఖర్చుల నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ. 57,500 మంజూరయ్యాయి. ఈ సహాయం కోసం కనకదుర్గ భర్త ఎన్.సత్యనారాయణ రాజు కూకట్పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు శేరి సతీష్ రెడ్డి ని ఆశ్రయించారు. అనంతరం, తెలంగాణ ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి చొరవతో సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తును పరిశీలించిన ప్రభుత్వం రూ. 57,500 లను మంజూరు చేసింది. ఈ చెక్ ను శేరి సతీష్ రెడ్డి తమ క్యాంప్ కార్యాలయంలో సత్యనారాయణ రాజు కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా కృషి చేస్తామని తెలిపారు. అనంతరం శేరి సతీష్ రెడ్డి సహాయానికి, ప్రభుత్వానికి సత్యనారాయణ రాజు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో 114 డివిజన్ ప్రెసిడెంట్ తమ్మినేని ప్రవీణ్ కుమార్,115 డివిజన్ అధ్యక్షులు కృష్ణ రాజ్ పుత్,మేకల మైకల్, రేష్మ,రాజు,శ్రీధర్ చారి, రామకృష్ణారెడ్డి,అంజిరెడ్డి, పాల్గొన్నారు. ప్రభుత్వ ఆసుపత్రి లో పోషకాహార మాసోత్సవాలు పెనుగంచిప్రోలు, సెప్టెంబర్ 17 ( వార్త ప్రభ ) ఐసిడిఎస్ చిల్లకల్లు ప్రాజెక్టు నందు పోషకాహార మాసోత్సవాలు సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 16 వరకు జరుగుతున్నాయి. ఈ కార్యక్రమంలో భాగంగా చిల్లకల్లు ప్రాజెక్టు సిడిపిఓ సత్యవతి ఆదేశాల మేరకు మొదటి రోజు బుధవారం పెనుగంచిప్రోలు ప్రభుత్వ ఆసుపత్రి నందు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గర్భవతులు, బాలింతలు, డాక్టర్ నాగరాణి, ఆశాలు,ఏఎన్ఎం,లు అంగన్వాడి కార్యకర్తలు,తల్లులు ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. అలానే గర్భిణీ స్త్రీలకు, బాలింతలకు అంగన్వాడీ సెంటర్ లో వచ్చే పోషకాహారాల గురించి ఎలా ఉపయోగించుకోవాలి అనే దాని గురించి వివరించడం జరిగింది..

## గట్కా పోటీలలో జడ్పీహెచ్ఎస్ విద్యార్థులకు పతకాలు




**ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 17(వార్తా ప్రభ ప్రతినిధి):** రాష్ట్ర స్థాయి గట్కా పోటీలలో పశ్చిమ ఇబ్రహీంపట్నం జడ్పీహెచ్ఎస్ పాఠశాల ప్రతిభ కనబరిచి అనేక పథకాలు సాధించారు. విజయవాడ లయోలా కాలేజీ లో 4వ రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో పశ్చిమ ఇబ్రహీంపట్నం జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు మూడు బంగారు,ఒక క్యాంస్యం పథకం సాధించారు. ఎ అరవింద్, షేక్ కరిష్మా,గణేష్ లు బంగారు పథకాలు సాధించగా, కె.క్రాంతి కుమార్ కాంస్యం సాధించాడు. అక్టోబర్ 10 నుండి 14 వరకు ఛత్తీస్ గడ్ లో జాతీయ పోటీలకు ఈ విద్యార్థులు పాల్గొననున్నారు. సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పథకాలు సాధించిన విద్యార్థులను పిడి రామ శేఖర్, ప్రధాన ఉపాధ్యాయులు సంతోష్ కుమార్ అభినందించారు.

**పాఠశాలకు కంప్యూటర్ బహుకరణ** పాఠశాలలో సోషల్ టీచర్ల పని చేస్తున్నా వి. సునీత తన భర్త పొదిల కుమార్ జ్ఞాపకార్థం కంప్యూటర్ వితరణ చేశారు.

## ప్రభుత్వ ఆసుపత్రి లో పోషకాహార మాసోత్సవాలు





**పెనుగంచిప్రోలు, సెప్టెంబర్ 17 ( వార్త ప్రభ )** ఐసిడిఎస్ చిల్లకల్లు ప్రాజెక్టు నందు పోషకాహార మాసోత్సవాలు సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 16 వరకు జరుగుతున్నాయి. ఈ కార్యక్రమంలో భాగంగా చిల్లకల్లు ప్రాజెక్టు సిడిపిఓ సత్యవతి ఆదేశాల మేరకు మొదటి రోజు బుధవారం పెనుగంచిప్రోలు ప్రభుత్వ ఆసుపత్రి నందు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గర్భవతులు, బాలింతలు, డాక్టర్ నాగరాణి, ఆశాలు,ఏఎన్ఎం,లు అంగన్వాడి కార్యకర్తలు,తల్లులు ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. అలానే గర్భిణీ స్త్రీలకు, బాలింతలకు అంగన్వాడీ సెంటర్ లో వచ్చే పోషకాహారాల గురించి ఎలా ఉపయోగించుకోవాలి అనే దాని గురించి వివరించడం జరిగింది..

## పంచాయతీ పారిశుధ్య కార్మికుడు కొండలకు శ్రద్ధాంజలి ఘటించిన వేల్పుల



**పెనుగంచిప్రోలు, సెప్టెంబర్ 17( వార్త ప్రభ)** పెనుగంచిప్రోలు మేజర్ గ్రామ పంచాయతీ పారిశుధ్య కార్మికుడు పండ్రకోల కొండలు మంగళవారం సాయంత్రంవీధి నిర్వహణ లో ఉండి గుండెపోటుతో ఆకస్మికంగా మరణించారు. వారి ప్రార్థివ దేహాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ నెడ్ క్యాప్ కార్పొరేషన్ చైర్మన్, పెనుగంచిప్రోలు గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్ వేల్పుల రవికుమార్ , పెనుగంచిప్రోలు గ్రామ పంచాయతీ కార్యదర్శి గొర్రెపాటి శ్యాం కుమార్ లు పూల మాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు.. ఆయన మరణం పట్ల తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. వారి సోదరులు పండ్రకోల శ్రీనివాస్, 8వ వార్డు సభ్యులు గుజ్జర్లపూడి రాంబాయి, గుజ్జర్లపూడి ఉదయ్ బాబు, ప్రెస్ క్లబ్ కన్వీనర్ బొల్ల రవికుమార్, గుండ్ర హృదయరాజు , సొసైటీ డైరెక్టర్. కనపర్తి. శ్రీనివాసరరావు ఫణితి పూర్ణ,పండ్ర కోల, రాంబాబు,దుంపల, గోపాల రావు, గుజర్ల పూడి, గోపి, జిల్లేపల్లి, జిన్నా, చప్పిడి, శ్రీను, గోపి, గ్రామ పంచాయతీ సిబ్బంది, పారిశుధ్య కార్మికులు, ప్రజలు పాల్గొన్నారు...

## అణగారిన వర్గాలు ఆత్మగౌరవంతో బ్రతకాలి.

*పద్మశ్రీ అవార్డు గ్రహీత, ఎమ్మార్పీఎస్ అధినేత మందకృష్ణ మాదిగ.*

*జవహర్ నగర్ లో కల్లేపల్లి సదానంద్ కు పరామర్శ.*





**జవహర్ నగర్, సెప్టెంబర్ 17:(వార్తా ప్రభ)** అణగారిన వర్గాలు ఆత్మగౌరవంతో బ్రతకాలని పద్మశ్రీ అవార్డు గ్రహీత, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, ఎమ్మార్పీఎస్ అధినేత మందకృష్ణ మాదిగ అన్నారు. బుధవారం జవహర్ నగర్ ఏమార్పిస్, మరియు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కళ్ళేపెల్లి సదానంద్ మాతృమూర్తి కళ్ళేపెల్లి మధునమ్మ జ్ఞాపకార్థం బుధవారం జవహర్ నగర్ లోని అంబేద్కర్ నగర్ లో కల్లేపల్లి సదానంద్ నివాసంలో నిర్వహించిన సంవత్సరికం కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొని కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో ఎన్నో వివక్షలను ఎదుర్కొంటూ, జాతి శ్రేయస్సుతోపాటు, సామాజిక సేవా దృక్పథంతో ఎన్నో కార్యక్రమాలు చేపట్టి ప్రజల అభిమానాలతో, రాజ్యాంగ పలాలను ప్రజలందరికీ అందించడంలో నా వంతు కృషి చేస్తున్నానని, ఇందుకు సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎం జె ఎఫ్ తెలంగాణ రాష్ట్ర ఇంచార్జ్ తిప్పారపు లక్ష్మణ్ మాదిగ, మేడ్చల్ ఇంచార్జ్ వడ్డేపల్లి శివ కుమార్ మాదిగ, ఎంజేఫ్ రాష్ట్ర నాయకులు బూడిద నరేందర్ మాదిగ, తూటి శ్రీనివాస్ మాదిగ, పాలపర్తి రవి మాదిగ, స్థానిక మాజీ కార్పొరేటర్లు గండి రామ్ చందర్, కుతాడి సాయి, పల్లపు రవి, స్థానిక నాయకులు తురుగొండ రామన్న, మాజీ ఎంపీపీ మంద యాదగిరి, కొయ్యాడ వెంకటేష్, బూడిద వెంకటేష్, బూడిద బాలరాజు, మంద ఆనంద్, గడిపే సునీల్, కానుగంటి వెంకటేష్, కొంపల్లి వెంకట నర్సయ్య, ఎర్ర రాము, తదితరులు పాల్గొన్నారు.

## చేజర్ల సొసైటీలో అధ్యక్షులు డైరెక్టర్లు బాధ్యతలు స్వీకరణ

*ఘనంగా సత్కరించిన చేజర్ల టిడిపి సీనియర్ నాయకులు*



**చేజర్ల సెప్టెంబరు 17 (వార్తాప్రభ)** చేజర్ల సొసైటీ అధ్యక్షులుగా బూదల్ల వీర రాఘవరెడ్డి మరియు సొసైటీ డైరెక్టర్లుగా ఎన్నికైన మడమంచి సుధీర్ చౌదరి ఆరెద్దుల రామకృష్ణయ్యలు చేజర్ల సొసైటీ కార్యాలయం నందు బుధవారం బాధ్యతలు స్వీకరించడం జరిగినది. ఈ సందర్భంగా నెల్లూరు జిల్లా పార్లమెంటరీ సెక్రటరీ రావి పెంచలరెడ్డి చేజర్ల మండల టీడీపీ సీనియర్ నాయకులు రావి లక్ష్మీనరసారెడ్డి చేజర్ల మండల టీడీపీ అధ్యక్షులు షేక్ సిరాజుద్దీన్ చేజర్ల మండల తెలుగుయువత నాయకులు రావి కృష్ణారెడ్డి బోడిపాడు ఎంపీటీసీ సభ్యులు షేక్ మస్తాన్ చేజర్ల పెద్దచెరువు చైర్మన్ అరవ గోపిరెడ్డి లు వారిని కలిసి శాలువా పూలమాలలతో ఘనంగా సత్కరించడం జరిగినది.

## ఘనంగా శ్రీ విరాట్ విశ్వకర్మ జయంతి వేడుకలు

### జయంతి వేడుకల్లో పాల్గొన్న కె.యం. ప్రతాప్





**కుత్బుల్లాపూర్ సెప్టెంబర్ 17 (వార్తాప్రభ) :** శ్రీ విరాట్ విశ్వకర్మ జయంతి సందర్భంగా అయోధ్య నగర్లో గల శ్రీ బ్రహ్మంగారి ఆలయంలో శ్రీ విరాట్ విశ్వకర్మ సంఘం వారు ఏర్పాటు చేసిన కార్యక్రమానికి బుధవారం ముఖ్య అతిథిగా రంగారెడ్డి జిల్లా మాజీ డిసిసి అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, కె.యం. ప్రతాప్ విచ్చేసి, శ్రీ విరాట్ విశ్వకర్మ భగవంతునికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు, అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో శ్రీ విరాట్ విశ్వకర్మ సంఘం ముఖ్య సలహాదారులు వి.బాల్ రాజ్ చారి, కె.వి.రామాచారి,ఎస్. నారాయణ చారి, సలహాదారులు కే. సత్యనారాయణ చారి, కే. వీరేశం అధ్యక్షులు కొత్తపల్లి కృష్ణాచారి, ప్రధాన కార్యదర్శి వడ్ల సుభాష్ చారి, కోశాధికారి ఆంజనేయులు చారి, బ్రహ్మయ్య చారి, ఉపాధ్యక్షులు జనార్దన్ చారి, అశోక్ చారి,సంయుక్త కార్య దర్శులు రమేష్ చారి, బాబు చారి, కార్యనిర్వాహకులు: ప్రభాకర్ చారి,ఆనంద్ చారి, జగన్నాద్ చారి,ఆంజనేయులు చారి, సత్యనారాయణ చారి, రాజేశ్వర్ చారి, రమేష్ చారి, నరసింహ చారి,రాధాకృష్ణ చారి, అయోధ్య నగర్ సంక్షేమ సంఘం మాజీ అధ్యక్షులు మాద రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేసిన కాంగ్రెస్ ఇంచార్జ్ జగదీశ్వర్ గౌడ్



**శేరిలింగంపల్లి,సెప్టెంబర్ 17 (వార్తాప్రభ):** శేరిలింగంపల్లి నియోజకవర్గం లింగంపల్లి డివిజన్ పరిధిలో గల నల్లగండ్ల లో పలువురు వైద్య చికిత్స నిమిత్తం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య మంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకొనగా పలువురు లబ్ధిదారులకు మంజూరైన రూ.2,40,000 ఆర్థిక సహాయానికి సంబంధించిన సీఎంఆర్ఎఫ్ చెక్కులను బాధిత కుటుంబాలకి టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి,శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వి.జగదీశ్వర్ గౌడ్ అందజేశారు. ఈ సందర్భంగా వైద్య చికిత్సకి సహకారం అందించిన టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి,శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వి.జగదీశ్వర్ గౌడ్ కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియచేస్తున్నాము అని బాధితుల కుటుంబ సభ్యులు పేర్కొన్నారు.

## అధిక యూరియా వాడకంపై అవగాహన సదస్సు



**చేజర్ల సెప్టెంబరు 17 (వార్తాప్రభ)** మండలంలోని చిత్తలూరు నెర్నూరు గ్రామంలో అధిక యూరియా వాడకం వలన కలుగు పరిణామాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో మండల వ్యవసాయ అధికారి హిమబిందు మాట్లాడుతూ అధికంగా యూరియా వినియోగం వలన నేలలో ఆమ్లతత్వం పెరిగి పోషకాలు అందుబాటులో లేకుండా ఉంటాయి. నీటి మరియు నేల కాలుష్యం అధికమవుతుంది. పైరు ఏపుగా పెరిగి చీడపీడలు ఎక్కువగా ఆశిస్తాయని తద్వారా పురుగుమందులు తెగులు మందులు అధికంగా వాడవలసి వస్తుందని తెలియజేశారు. అంతే కాకుండా వేసిన పంట పరిశీలించి అనంతరం రైతులతో మాట్లాడుతూ భూమి లేని కౌలు రైతులు సిసిఎస్ కార్డు పొందడం వలన ప్రభుత్వం పథకాలు రాయితీని పొందవచ్చని తెలిపారు. కౌలు రైతులు తప్పనిసరిగా సిసిఆర్ కార్డు పొందాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో వీఏవ నాగభూషణం ఝాన్సీ మరియు రైతులు పాల్గొన్నారు

# రక్తదానానికి అందరూ ముందుకురావాలి

- మోడీ పుట్టిన రోజు రెడ్ క్రాస్ రక్తదాన శిబిరం
- లయోలా ఇంజనీరింగ్ కాలేజీలో 40 మంది రక్తదానం



**విజయవాడ,సెప్టెంబరు 17 (వార్తాప్రభ) :** అన్ని దానాల్లో కంటే రక్తదానం అపూర్వమైనదని రెడ్ క్రాస్ సొసైటీ ఎన్టీఆర్ జిల్లా కమిటీ ఉపాధ్యక్షులు డాక్టర్ వెలగా జోషి పేర్కొన్నారు .ప్రధాని నరేంద్ర మోడీ 75వ జన్మదిన సందర్భంగా అఖిల భారతీయ తెరపాత్ యువక్ పరిషత్ సౌజన్యంతో రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో బుధవారం ఉదయం విజయవాడలోని లయోలా ఇంజనీరింగ్ కళాశాలలో రక్తదాన శిబిరం జరిగింది. ఈ శిబిరంలో 40 మంది విద్యార్థులు రక్తదానం చేశారు .ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి యువక పరిషత్ నుంచి వికాస్ జైన్ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ వెలగా జోషి మాట్లాడుతూ రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో ఇటీవల చేపడుతున్న రక్తదాన శిబిరాలకు అపూర్వమైన స్పందన లభిస్తుందన్నారు. దాతలు ఇచ్చే రక్తాన్ని అవసరమైన వారికి సకాలంలో అందించి ప్రాణాపాయ స్థితి నుంచి కాపాడుతున్నామని పేర్కొన్నారు. రెడ్ క్రాస్ సొసైటీ సెక్రటరీ చిట్టిబాబు మాట్లాడుతూ లయోలా ఇంజనీరింగ్ కాలేజ్ నుంచి 40 మంది విద్యార్థులు రక్తదానం చేయడం అభినందనీయమన్నారు .ఈ కాలేజీలో పని చేసే ప్రొఫెసర్ ఎం రామకృష్ణ 30 వ సారి రక్తదానం చేయటం అందరికీ స్ఫూర్తిదాయకం అని పేర్కొన్నారు. రెడ్ క్రాస్ సొసైటీ డాక్టర్ మదన్ ,యువక పరిషత్ సభ్యులు, ఇంజనీరింగ్ కాలేజీ సిబ్బంది పాల్గొన్నారు.

# జిల్లా యూనిట్ తో సమీకరణాలు మారనున్నాయా!



**వినన్నపేట,సెప్టెంబరు 17 (వార్తాప్రభ) :** స్థానిక మండల కేంద్రం అప్ గ్రేడ్ గ్రామపంచాయతీగా అభివృద్ధి చెందడంతో డిప్యూటీ ఎంపీడీవో పోస్ట్ తో పాటు సానిటరీ ఇన్స్పెక్టర్ పోస్ట్ కూడా మంజూరు కానున్నట్లు తెలుస్తోంది. రాబోయే గ్రామ పంచాయతీ ఎన్నికలలో జిల్లా యూనిట్ గా రిజర్వేషన్ తీసుకుంటే ఎస్సీ మహిళ,బీసీ మహిళ, ఓసి జనరల్ వీటిలో ఒక కేటగిరి తెరపైకి వచ్చే పరిస్థితి ఉన్నట్లు సర్వత్ర అనుకుంటున్నారు. ఇప్పటివరకు గ్రామపంచాయతీ ఏర్పడిన తర్వాత ఎస్సీ మహిళ, బీసీ మహిళ రిజర్వేషన్లు అమలు కాలేదని మండల యూనిట్ గా తీసుకుంటే బీసీ మహిళ రిజర్వేషన్ నూటికి 99 శాతం వస్తుందని పద్మశాలి, ముదిరాజ్, రజక యాదవ, తెలికల, నాయి బ్రాహ్మణ, విశ్వబ్రాహ్మణ, దొమ్మర దాసరి బోయ బెస్త మందుల కుమ్మర తదితర సామాజిక వర్గాల బడుగు బలహీన వర్గాలకు చెందిన ఆడపడుచులు ఎదురు చూస్తున్నారు. అదే సమయంలో ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన మాదిగ మరియు మాల సామాజిక వర్గ ఆడపడుచులు రాజకీయ కుటుంబాలు ఉత్సాహం చూపుతున్నాయి. రిజర్వేషన్ ఏదైనా గెలుపుకురాలను సిద్ధం చేసే పనిలో ఒక రాజకీయ పార్టీ సాప కింద నీరులా ఎన్నారై కుటుంబాలను రంగంలోకి దింపనున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి.

# రెజనెన్స్ కాలేజీలో ఫోక్సో చట్టంపై విద్యార్థులకు అవగాహన



**మైలవరం,సెప్టెంబరు 17 (వార్తాప్రభ) :** మైలవరం పట్టణంలోని రెజనెన్స్ జూనియర్ కళాశాలలో ఫోక్సో చట్టం (POCSO Act) పై బుధవారం అవగాహన సదస్సు జరిగింది.ఈ సందర్భంగా మైలవరం సిఐ దాడి చంద్రశేఖర్ మాట్లాడుతూ సోషల్ మీడియా దుర్వినియోగం, వేధింపులు, అశ్లీల వ్యాఖ్యలు వంటి చర్యలు భవిష్యత్తును దెబ్బతీసేలా నేరాల కిందికి వస్తాయని అన్నారు.విద్యార్థుల నిర్లక్ష్యపు చర్యల వల్ల వచ్చే క్రిమినల్ కేసులు, అలాగే మంచి ప్రవర్తన తదితర అంశాల గురించి వివరించారు.విద్యార్థులు మంచి పౌరులుగా మారేందుకు క్రమశిక్షణ, గౌరవప్రదమైన ప్రవర్తన, మరియు చట్టాల పట్ల అవగాహన అవసరమని సూచించారు.తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి సమాజంలో చట్టబద్ధమైన, సన్మార్గమైన జీవన విధానాన్ని కొనసాగించాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో స్థానిక ఎస్సై సుధాకర్,ప్రిన్సిపాల్, బోధనా సిబ్బంది విద్యార్థు లు పాల్గొన్నారు.

# నరేంద్ర మోడీ జన్మదిన సందర్భంగా మొక్కలు నాటే కార్యక్రమం




**హనుమాన్ జంక్షన్,సెప్టెంబరు 17 (వార్తాప్రభ) :** భారత ప్రధాని నరేంద్ర మోడీ 75 వ జన్మదిన సందర్భంగా రాణా వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో అధ్యక్షులు సుంకర సాంబశివ రాయల్ హనుమాన్ జంక్షన్ ఇందిరా నగర్ గట్టుమీద ఐదు మొక్కలు నాటడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఏపీ రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ గరికిపాటి శివశంకర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాతావరణ నీ పరిరక్షించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో రాణా వెల్ఫేర్ సొసైటీ సభ్యులు మాదు రమేష్, ఎం సుధీర్, మారిశెట్టి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

# గుడివాడ భాజపా నాయకుల అధ్వర్యంలో మోడీ జన్మదిన వేడుకలు





**గుడివాడ,సెప్టెంబరు 17 (వార్తాప్రభ) :** ప్రధాని నరేంద్ర మోడీ 75వ జన్మదినోత్సవాన్ని భారతీయ జనతా పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ ఆసుపత్రి నందు పండ్లు బిస్కెట్ ప్యాకెట్లు మంచి రక్త దానం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెనిగళ్ళ రాము మాట్లాడుతూ ఈరోజు భారతదేశానికి ఒక పండుగని, ప్రధాని నరేంద్ర మోడీకి ఆ ముక్కోటి దేవతలు ఆశీస్సులు అందించాలని తద్వారా మన రాష్ట్రానికి పెద్ద ఎత్తున నిధులు రైతులు సమకూర్చిన మోడీకి గుడివాడ ప్రాంతం తరఫున ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నానని అన్నారు. ఆంధ్రప్రదేశ్ ఆక్వా బోర్డు డైరెక్టర్, మాజీ జిల్లా అధ్యక్షులు గుత్తికొండ శ్రీ రాజబాబు మాట్లాడుతూ పేద ప్రజల ఆశ జ్యోతి అత్యంత గడ్డి పరిస్థితి నుంచి దేశ ప్రధానిగా ఎదిగిన గొప్ప నిదర్శనీకుడన్నారు. ముఖ్యంగా పోలవరం మరియు అమరావతిని పూర్తి చేసేందుకు ఓటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని దానికి ప్రధానమంత్రి సంపూర్ణ సహకారం అందిస్తున్నారని కొనియాడారు. పార్లమెంట్ కన్వీనర్ సూర్య లక్ష్మీనారాయణ (గాంధీ) మాట్లాడుతూ గుజరాత్ ముఖ్యమంత్రిగా మూడుసార్లు ఈ దేశ ప్రధానిగా మూడోసారి ఎన్నికయి ఈ దేశం ఎటువంటి ఇబ్బందులు పడకుండా అప్పటినుంచి కూడా ఉచితంగా పేదలందరికీ దేశవ్యాప్తంగా బియ్యం అందిస్తున్నారని అన్ని రాష్ట్రాల కంటే మిన్నగా మన ఆంధ్ర రాష్ట్రాన్ని గొప్పగా అభివృద్ధి చేస్తున్నారని కొనియాడారు. జిల్లా ప్రధాన కార్యదర్శి అంగడాల సతీష్ మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో సేవా పక్వాడ్ అనే పార్టీ పిలుపుమేరకు ఈరోజు నుంచి మహాత్మా గాంధీ పుట్టినటువంటి అక్టోబర్ రెండు వరకు అనేక సేవా కార్యక్రమాలు పెద్ద ఎత్తున చేస్తున్నామని తెలిపారు. పట్టణ అధ్యక్షులు మాచర్ల రామకృష్ణ కె వెంకటేష్ లు మాట్లాడుతూ గుడివాడ మున్సిపాలిటీ అమృత పథకం ద్వారా వందలాది కోట్ల రూపాయలతో అభివృద్ధి చేస్తున్నారని గుడివాడ ఇంతలా అభివృద్ధి చెందుతుంది అంటే దానికి కారణం నరేంద్ర మోడీ ప్రధానమంత్రిగా ఉండటంవల్లనే కొనియాడారు. పట్టణ మాజీ అధ్యక్షులు యర్రపోతు అర్జున్ మాట్లాడుతూ కింద స్థాయి నుండి అంచలంచలుగా ఎదుగుతూ ఈరోజు ప్రపంచంలోనే గొప్ప శక్తిగా భారతదేశం ఎదిగిందంటే దానికి కారణం నరేంద్ర మోడీ అన్నారు. ఈ కార్యక్రమంలో బోనం గోపిక, మాకాని జనార్ధన్, రీటా, నందివాడ మండల అధ్యక్షులు వాసుపల్లి రాంప్రసాద్, గుడివాడ రూరల్ మండలం అధ్యక్షులు దివి తేజ మాణిక్యం, సీనియర్ పార్టీ నాయకులు శీలం శంకర్రావు, జిల్లా నాయకులు కొత్త కిరణ్, తిరుపాలు గుప్తా తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వి.కె.ఆర్ & వి.ఎన్.బి ఇంజనీరింగ్ కాలేజీ నందు..




స్థానిక వి.కె.ఆర్ & వి.ఎన్.బి ఇంజనీరింగ్ కాలేజీలో బిజెపి జిల్లా ఉపాధ్యక్షుడు వల్లపర్ల వెంకటేశ్వరరావు అధ్వర్యంలో సేవా పక్వాడా మెగా రక్తదాన శిభిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా రాష్ట్ర బిజెపి ప్రధాన కార్యదర్శి మట్టా ప్రసాద్ పాల్గొని రక్తదానం చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ దేశ ప్రధాని నరేంద్ర మోడీ జన్మదినోత్సవాని పురస్కరించుకుని ఇంజనీరింగ్ సెక్రటరీ వేములపల్లి కోదండ రామయ్య తమ కాలేజీలో సురక్ష బ్లడ్ బ్యాంక్ విజయవాడ వారి నేతృత్వంలో 70 మంది విద్యార్థులచే రక్తదానం చేయడం అభినందనీయమన్నారు. తొలుత మోడీ జన్మదినోత్సవం కేక్‌ను మట్టా ప్రసాద్ కట్ చేసి విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి పట్టణ 1వ అధ్యక్షుడు కెకెడి ప్రసాద్, మూడెడ్ల శ్రీధర్, బద్రీ, కొత్త కిరణ్ మరియు కాలేజీ విద్యార్థులు అధ్యాపక బృందం తదితరులు పాల్గొన్నారు.

# మానవతా గుడివాడ వారి అధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాలు





**గుడివాడ,సెప్టెంబరు 17 (వార్తాప్రభ) :** బుధవారం మధ్యాహ్నం మమతా వృద్ధాశ్రమమంలో మానవతా డైరెక్టర్ గుత్తా నళిని అత్తమామలు గుత్తా లక్ష్మణదాసు తారాబాయి మరియు కుమారుడు గోపీకృష్ణల జ్ఞాపకార్ధం అన్నదాన కార్యక్రమమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమమంలో ఉమ్మడి కృష్ణాజిల్లా సమన్వయకమిటీ చైర్మన్ పొట్లూరి వీరశేషగిరిరావు, గుడివాడ మానవతాశాఖ చైర్మన్ పిన్నమనేని వేణుగోపాలరావు, కోశాధికారి రాధాకృష్ణ, కార్యవర్గసభ్యులు ఘంటా చంద్రశేఖరరావు, గుత్తా నళిని ఇతర మానవతా సభ్యులు పాల్గొన్నారు.

**పితృపక్షము సందర్భంగా అన్నదానం కార్యక్రమం.. :**

బుధవారం మానవతా సభ్యురాలు ప్రసూన హైదరాబాద్ తండ్రి గారైన కీర్తిశేషులు మధుసూదన్ రావు జ్ఞాపకార్థం (భార్య ఉదయలక్ష్మి) గుడివాడలోని పాత మున్సిపల్ ఆఫీస్ ప్రక్కనగల అన్న క్యాంటీన్ నందు అన్నదాన కార్యక్రమం సందర్భంగా పితృపక్షము సందర్భముగా చేయడం జరిగినది. కీర్తిశేషులు మధుసూదన్ రావు గారి ఆత్మ సద్గతి పొందాలని శాంతి పొందాలని మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆకాంక్షించింది. ఈ కార్యక్రమానికి ఉమ్మడి కృష్ణాజిల్లా పర్యావరణ కమిటీ చైర్మన్ దండమూడి జయలక్ష్మి, సుధా, ఉదయలక్ష్మి ఇతర సభ్యులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# మెగా డీఎస్సీ 2025 ఉద్యోగాలు సాధించిన వారికి ఘన సత్కారం



**విజయవాడ, సెప్టెంబరు 17 (వార్తాప్రభ) :** స్థానిక ఠాగూర్ గ్రంథాలయం విజయవాడ నందు ఉదయం 11 గంటలకు మెగా డీఎస్సీ నందు 17 మంది ఉద్యోగం సాధించిన వారిని సత్కరించుటకు ముఖ్య అతిథిలుగా గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, రాష్ట్ర పౌరగ్రంథాలయ శాఖ డైరెక్టర్ ఏ కృష్ణ మోహన్, కృష్ణా జిల్లా గ్రంథాలయ కార్యదర్శి వీ రవికుమార్ లు ముఖ్య అతిథులుగా పాల్గొని ఉద్యోగాలు వచ్చిన వారిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు మాట్లాడుతూ బాబు వస్తే జాబు వస్తుందనే నినాదంతో వచ్చిన ప్రజా ప్రభుత్వం మనది ఆ దిశగా ఈరోజు మెగా డీఎస్సీలో ప్రభుత్వ గ్రంథాలయాన్ని ఉపయోగించుకుని ఉద్యోగాలు పొందిన వారిని చూస్తుంటే ఎంతో ఆనందంగా ఉంది వారికి శుభాభినందనలు తెలియజేస్తూ భవిష్యత్ తరాల వాళ్ళకు వీళ్లు స్ఫూర్తిదాయకం అని అన్నారు. ఈ ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తుంది అన్నారు. ఇంకో ముఖ్య అతిథి ఏ కృష్ణమోహన్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 350 మంది దాకా ప్రభుత్వ గ్రంథాలయాల నందు చదువుకొని ఉద్యోగాలు సాధించారని ఎంతో ఆనందదాయకుమని వారికి అభినందనలు తెలుపుతూ వారి కృషి ని కొనియాడారు. ఎంతోమంది పేద విద్యార్థులకు ఇంట్లో చదువుకునే వసతి లేక గ్రంథాలయాన్ని ఆశ్రయించి చదువుకుని ఉద్యోగాలు సాధించటం కు గ్రంథాలయాలు కీలక పాత్ర వహించుతున్నాయని కొనియాడారు. మరో అతిథిగా పాల్గొన్న వి.రవి కుమార్ మాట్లాడుతూ ఠాగూర్ గ్రంథాలయం నుంచి డీఎస్సీకే సెలెక్ట్ అయిన విద్యార్థులకు అభినందనలు తెలియజేస్తూ ఇంకా ఎక్కువమంది లైబ్రరీని ఉపయోగించుకొని ఉద్యోగాలు పొందాలని మెరుగైన సేవలు అందిస్తామని తెలియజేశారు. అనంతరం ఉద్యోగాలు పొందిన వారి అందరిని దుశ్శాలువతో జ్ఞాపకతో సత్కరించి పరిషత్ చైర్మన్ ఉద్యోగాలు సాధించిన వారి అందరికీ మిఠాయి తినిపించారు. ఈ కార్యక్రమంలో ఠాగూర్ గ్రంథాలయ అధికారి కే రమాదేవి, గ్రేడ్ 3 గ్రంథ పాలకురాలు వై ధనలక్ష్మి, గ్రంథాలయ పాఠకులు ఉద్యోగాలు సాధించిన వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# మల్లేల పీఏసీఎస్ చైర్మన్‌గా గడిపర్తి హనుమంతరావు ప్రమాణ స్వీకారం

**యన్ టీ ఆర్ జిల్లా/తిరువూరు,సెప్టెంబరు 17 (వార్తాప్రభ) :** తిరువూరు నియోజకవర్గంలోని మల్లేల వ్యవసాయ సహాయ సహకార సంఘం సొసైటీ (పీఏసీఎస్) చైర్మన్‌గా గడ్డిపర్తి హనుమంతరావు ఘనంగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన స్థానిక ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ప్రమాణ స్వీకారం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ – పీఏసీఎస్ సమాజంలోని రైతుల ఆర్థికాభివృద్ధికి, సౌకర్యాల విస్తరణకు కేంద్రబిందువుగా ఉండాలి. కొత్త చైర్మన్ హనుమంతరావు గారు రైతుల సమస్యలను అర్థం చేసుకుని, పారదర్శకంగా వ్యవహరించాలని, అందరికీ అందుబాటులో ఉండే విధంగా పాలన నడిపించాలని కోరుకుంటున్నాను" అన్నారు. చైర్మన్ గడిపర్తి హనుమంతరావు మాట్లాడుతూ రైతుల సంక్షేమమే నా ప్రధాన లక్ష్యం. పీఏసీఎస్ ద్వారా రైతులకు రుణాలు, విత్తనాలు, ఎరువులు సమయానికి అందేలా కృషి చేస్తాను. అలాగే సహకార సంఘం వ్యవహారాల్లో ఎటువంటి అక్రమాలకు తావు లేకుండా పారదర్శకతతో ముందుకు సాగుతాను" అని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘం డైరెక్టర్లు, స్థానిక ప్రజాప్రతినిధులు, రైతు సంఘాల ప్రతినిధులు, పెద్ద ఎత్తున గ్రామస్తులు పాల్గొన్నారు




# చదరంగం పోటీలలో డా॥ కె.కె.ఆర్ గౌతమ్ విద్యార్థుల ప్రతిభ




**గుడివాడ,సెప్టెంబరు 17 (వార్తాప్రభ) :** ఈనెల 14వ తేదీన గుడివాడ లోని త్రివేణి స్కూల్ ఆధ్వర్యములో జరిగిన చదరంగం పోటీలలో డా॥కె.కె.ఆర్స్ గౌతమ్ స్కూల్ విద్యార్థులు ఘనమైన ప్రతిభ చాటారని ప్రిన్సిపాల్ కె.జ్యోతి తెలిపారు. ఈ పోటీలలో అండర్ -20 విభాగంలో 8వ తరగతి విద్యార్థి ఎన్.కిరణ్ ప్రథమ బహుమతి మరియు 9వ తరగతి విద్యార్థి ఎ.లోషిక్ వీరు ద్వితీయ బహుమతి మరియు 8వ తరగతి విద్యార్థి ఎ.ధీరజ్ తృతీచ బహుమతి మరియు అండర్ -8 విభాగంలో 1వ తరగతి విద్యార్థి పుర్వాష్ సాయి ప్రథమ బహుమతి, అండర్ -10 విభాగంలో 5వ తరగతి విద్యార్థి ఎమ్.దియాన్, ప్రథమ బహుమతి, అండర్ -12 విభాగంలో 5వ తరగతి విద్యార్థి ఎమ్.దివాష్ శ్రీ రెడ్డి ప్రథమ బహుమతి, అండర్ -14 విభాగంలో 6వ తరగతి విద్యార్థి సి.హెచ్.శర్వాణీ ఆధర్స్ లు ప్రథమ బహుమతి సాధించారు. ఇంతటి ప్రతిభను ప్రదర్శించిన క్రీడాకారులను మరియు కోచ్ స్వర్ణలత లను పాఠశాల ఆవరణలో జరిగిన సభలో ప్రిన్సిపల్స్ సత్యారామ్, లక్ష్మీప్రసాద్, జ్యోతి, ప్రశాంతి లు అభినందించారు.

# ఐ. జి. సి. ఆర్. డి. సి. క్యాంపు లో ఏ.ఎన్.ఆర్ విద్యార్థులు



**గుడివాడ,సెప్టెంబరు 17 (వార్తాప్రభ) :** స్థానిక అక్కినేని నాగేశ్వర రావు కళాశాల నుండి నలుగురు ఎన్. సి. సి క్యాడేట్స్ మరియు ఎన్. సి. సి అధికారి లెఫ్ట్ నెంట్ ఎం. డి. సలీం 07 సెప్టెంబర్ 2025 నుండి 16 సెప్టెంబర్ 2025 వరకు శశి ఇన్స్టిట్యూట్ అఫ్ టెక్నాలజీ అండ్ ఇంజనీరింగ్, తాడేపల్లిగూడెం, వెస్ట్ గోదావరి లో జరిగిన ఇంటర్ గ్రూప్ కాంపిటీషన్ రిపబ్లిక్ డే క్యాంపులో పాల్గొనడం అభినందనీయం అని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జె.ఎస్ కుమార్ తెలియజేసారు. ఈ శిక్షణ శిభిరములో పాల్గొని డ్రిల్ మరియు కల్చరల్ లో ఉత్తమ ప్రతిభ కనబరిచారు. చేబ్రోలు సన్ని, పి. వెంకట రమణ, ఎన్. ప్రేమ కుమార్, బి. మానస లు ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు గాను 19 ఆంధ్ర బెటాలియన్ ఎన్.సి.సి, కాకినాడ మెరిట్ సర్టిఫికెట్స్ ప్రధానం చేశారు. ఈ శిక్షణ శిబిరములో పాల్గొని తదుపరి క్యాంపులకు ఎంపిక అవడం అభినందనీయం అని కళాశాల పాలక వర్గ ప్రెసిడెంట్ ఎల్.ఆర్. కె ప్రసాద్, సెక్రటరీ మరియు కరెస్పాండంట్ కె. ఎస్. అప్పారావు మరి యు వైస్ ప్రిన్సిపాల్ బి.ఎస్. ఎస్ పద్మజ క్యాడేట్స్ ను అభినందించారు.

# మహిళలు ఆరోగ్యంగా ఉంటే కుటుంబం సమాజం ఆరోగ్యవంతం : మాధవీలత ఆశాజ్యోతి



**హనుమాన్ జంక్షన్,సెప్టెంబరు 17 (వార్తాప్రభ) :** గ్రామీణప్రాంత పేద ప్రజలకు వైద్యం పట్ల అవగాహన కల్పించాలని లేకుంటే జబ్బులు ముదిరి ప్రమాదం బారిన పడే అవకాశం ఉందని హనుమాన్ జంక్షన్ ఆశాజ్యోతి హ్యాండి కెప్డ్ వెల్ఫేర్ సొసైటీ కార్యదర్శి మరీదు మాధవీలత అన్నారు. బుధవారం ఏలూరు ఆశ్రం హాస్పటల్ ఆధ్వర్యంలో ఆశాజ్యోతి లో జరిగిన మేఘా వైద్య శిభిరాన్ని పెదపాడు మండల సి డి పి ఓ ఫతీమా బేగం తో కలిసి మాధవీ లత ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యంగా మహిళలు ఆరోగ్యంగా ఉంటే కుటుంబం తద్వారా సమాజం ఆరోగ్యంగా ఉంటుందని అన్నారు. ఆశాజ్యోతి లోని దివ్యాంగ బాల బాలికల పాటు సమీప గ్రామస్తులు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకున్నారు. వివిధ రకాల ఆరోగ్య సేవలు అందించేందుకు ఆశ్రం హాస్పటల్ డాక్టర్స్ టీం 160 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు ఉచితంగా అందించారు. ఈ కార్యక్రమంలో ఆశాజ్యోతి వ్యవస్థాపకులు మరీదు వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

# త్వరలో నాగాయలంక మండలంలో డిప్యూటీ సీఎం పర్యటన

**-ఏటిమొగలో ఏర్పాట్లు పరిశీలించిన ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ.**



**నాగాయలంక/అవనిగడ్డ,సెప్టెంబరు 17 (వార్తాప్రభ) :** రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ పర్యటన నేపథ్యంలో అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ బుధవారం నాగాయలంక మండలం ఏటిమొగలో పర్యటించారు. ఏటిమొగలో జడ్పీ హైస్కూల్ గ్రౌండ్, దివి వ్యవసాయ మార్కెట్ యార్డ్ ఆవరణ పరిశీలించారు. త్వరలో ఎదురుమొండి దీవుల్లో కరకట్ట రోడ్డు శంకుస్థాపనకు డిప్యూటీ సీఎం రానున్న నేపథ్యంలో సభా స్థలి ఎంపిక కోసం ఆయా ప్రదేశాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్డీఓ స్వాతి, నియోజకవర్గ టీడీపీ పరిశీలకులు కనపర్తి శ్రీనివాసరావు, నియోజకవర్గ యువనాయకులు మండలి వెంకట్రామ్, ఏఎంసీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, తహసీల్దార్ సీహెచ్ వీరాంజనేయ ప్రసాద్, డీఈ ఈలు పగడాల సురేష్, ఎం.రమేష్, నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

